సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
శనివారం, 08.08.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 277
పేజీలు: 08 వెల: రూ. 5


## ఈఎంఐ కట్టకపోతే ఫోన్ లాక్

30 రోజుల్లో ఫోన్ పార్ట్ లాక్.. 60 రోజులకు ఫుల్ లాక్!

- 2027 నుంచి కొత్త రూల్స్..
- డివైజ్ లాక్ చేసే హక్కు లెండర్స్‌కు.. పర్సనల్ డేటా మాత్రం సేఫ్
- ఆర్బీఐ కీలక నిర్ణయం
- లోన్‌పై ఫోన్ కొంటే జాగ్రత్త..
- ఈఎంఐ ఆలస్యమైతే కొత్త నిబంధనలు వర్తింపు.

02






## ఆగస్టు అగ్నిపరీక్ష!

### యువత అసంతృప్తే కేంద్రానికి అతిపెద్ద సవాల్?

- ఉపాధి, పరీక్షలే ఆగస్టు రాజకీయ అజెండా!
- ఆగస్టు 15 ప్రసంగంపై దేశవ్యాప్తంగా ఉత్కంఠ
- యువ ఉద్యమాలతో సమీకరణాలు మారనున్నాయా?
- నిరుద్యోగం, పేపర్ లీకులపై పెరుగుతున్న ఒత్తిడి
- అమిత్ షా పాత్ర కీలకం కానుందా?
- ప్రతిపక్షానికి యువత అసంతృప్తి అస్త్రమా?
- ఉపాధి హామీలతోనే ప్రభుత్వానికి ఊరట?
- జెన్-జెడ్ ఆగ్రహం రాజకీయాలపై ప్రభావం చూపుతుందా?

**ముద్ర డెస్క్:**
కేంద్ర ప్రభుత్వానికి ఆగస్టు నెల అత్యంత కీలకంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. ఈసారి ప్రభుత్వానికి సవాలు కేవలం ప్రతిపక్ష పార్టీల నుంచే కాకుండా, నిరుద్యోగం, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో జాప్యం, పరీక్షల నిర్వహణలో లోపాలు, ప్రశ్నపత్రాల లీకులు, డిజిటల్ వేదికలపై పెరుగుతున్న అసంతృప్తితో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న యువత నుంచి ఎదురయ్యే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా జెన్–జెడ్ తరం ఉపాధి, అవకాశాలు, పారదర్శక నియామకాలపై బలమైన హామీలు కోరుతున్న నేపథ్యంలో కేంద్రం నిర్ణయాలు రానున్న నెలల్లో రాజకీయ దిశను ప్రభావితం చేసే అవకాశముందని అంచనా వేస్తున్నారు.
ఆగస్టు 15న ఎర్రకోటపై నుంచి ప్రధాని నరేంద్ర మోదీ చేసే స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. యువత ఉపాధి, ప్రభుత్వ ఉద్యోగాల క్యాలెండర్, పరీక్షల సంస్కరణలు, ప్రశ్నపత్రాల లీకుల నివారణ, నైపుణ్యాభివృద్ధి, అప్రెంటిస్‌షిప్ అవకాశాలు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల బాధ్యత వంటి అంశాలపై ప్రధాని స్పష్టమైన కార్యాచరణ ప్రకటిస్తారా లేదా అన్నదే చర్చనీయాంశంగా మారింది. మిగతా 02లో

# వరుణ యాగం

## నాగార్జునసాగర్‌లో ఆగస్టు 10న సీఎం రేవంత్ చేతుల మీదుగా పూర్ణాహుతి

- విజయవిహార్ ప్రాంగణంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక యాగం
- 11 హోమకుండాలు, 108 మంది రుత్విక్కులతో వైభవంగా వరుణ యాగం నిర్వహణ
- రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు, నదులు-జలాశయాలు నిండాలని ప్రత్యేక వేద ప్రార్థనలు



**ముద్ర డెస్క్:**
రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను అధిగమించి, తెలంగాణ అంతటా సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని సంకల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మహా వరుణ యాగాన్ని నిర్వహించనుంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 10న నాగార్జునసాగర్ విజయవిహార్ ప్రాంగణంలో వైభవంగా ఈ వైదిక మహాక్రతువు జరగనుంది. యాగం ముగింపు సందర్భంగా జరిగే మహా పూర్ణాహుతిలో ముఖ్యమంత్రి స్వయంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.
రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సంప్రదాయ ఆధ్యాత్మిక మార్గంలో ప్రకృతి అనుగ్రహం కోరుతూ ప్రభుత్వం ఈ ప్రత్యేక యాగాన్ని చేపట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది. కృష్ణా, గోదావరి నదుల్లో సమృద్ధిగా వరద జలాలు ప్రవహించి, అన్ని డ్యామ్‌లు, జలాశయాలు, చెరువులు, కుంటలు జలకళ సంతరించుకోవాలని, వ్యవసాయం అభివృద్ధి చెందాలని, ప్రజలు సుఖశాంతులతో జీవించాలని యాగంలో సంకల్పం చేయనున్నారు.
యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన ప్రధాన అర్చకులు, సిద్ధాంతులు, వేద పండితులు శాస్త్రోక్తంగా పరిశీలించి ఆగస్టు 10వ తేదీని శుభ ముహూర్తంగా నిర్ణయించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని నాగార్జునసాగర్ డ్యామ్ సమీపంలోని విజయవిహార్ ప్రాంగణంలో యాగశాలను నిర్మించి ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. మిగతా 02లో

## ట్రంప్ పౌరసత్వ అస్త్రం

బర్త్‌రైట్ సిటిజన్‌షిప్‌పై కొత్త ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు



- 2 కొత్త ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు!
- అమెరికా పౌరసత్వ నిబంధనలు తీవ్ర కఠినతరం..
- భారతీయుల్లో ఆందోళన!

03

## భారత రక్షణ మరింత బలోపేతం

94 రఫేల్ జెట్లు భారత్‌లోనే తయారీ!



- మేక్ ఇన్ ఇండియాకు ఫ్రాన్స్ బూస్ట్
- హైదరాబాద్‌కు ఏరోస్పేస్ హబ్‌గా గుర్తింపు
- రూ.1.6 లక్షల కోట్ల వ్యాపార అవకాశాలు
- టెక్నాలజీ బదిలీతో రక్షణ రంగానికి ఊతం
- వాయుసేన బలోపేతానికి కీలక రఫేల్ డీల్

03

## స్కూల్ ఫీజుల నియంత్రణపై కీలక అడుగు

ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ.. 02

- ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల వివరాలు బహిరంగం తప్పనిసరి
- నోటీస్ బోర్డు, వెబ్‌సైట్‌లో ఫీజుల ప్రదర్శనకు ఆదేశాలు
- నిబంధనలు ఉల్లంఘిస్తే గుర్తింపు రద్దు వరకు చర్యలు
- ఫీజుల దోపిడీకి చెక్.. విద్యాశాఖ కఠిన మార్గదర్శకాలు
- పారదర్శక ఫీజు విధానంతో తల్లిదండ్రులకు ఊరట



## దేశంలో తెలంగాణ నెం.1

### సైబర్ నేరాల నియంత్రణలో అగ్రస్థానం



- పీఎంవో ప్రగతి సమీక్షలో తెలంగాణకు జాతీయ స్థాయి గుర్తింపు
- టీజీ సీఎస్‌బీ పనితీరును ప్రశంసించిన డీజీపీ సీవీ ఆనంద్
- ఫిర్యాదుల పరిష్కారంలో 88% డబ్బు రికవరీలో 81% విజయశాతం
- రూ.5 లక్షలకుపైగా మోసాలపై 49 ఈజీరో ఎఫ్ఐఆర్ లు నమోదు
- 5,500 మంది నేరస్తుల ప్రొఫైళ్లు.. 15 వేల అంతర్రాష్ట్ర లింకుల గుర్తింపు
- 8.5 లక్షల మందికి సైబర్ అవగాహన.. 2 లక్షల మందికి డిజిటల్ అరెస్ట్ మోసాలపై ప్రచారం
- సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌లో తెలంగాణ దేశానికి ఆదర్శమన్న డీజీపీ

02

## మిత్రపక్షంపై తిరుగుబాటు?

కొత్తగూడెం రాజకీయంలో కాంగ్రెస్




- సీపీఐ మధ్య తీవ్రమైన కాక
- 'మొక్కే కదా అని పీకితే పీక కొస్తాం'..
- సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని ఘాటు వ్యాఖ్యలు

03

## పెట్రోల్‌కు నై.. ఈవీలకు జై!

భారత ఆటోమొబైల్ రంగంలో వేగంగా మారుతున్న ట్రెండ్..

పెట్రోల్ కార్లకు తగ్గుతున్న ఆదరణ 02



## 5 కోట్ల మందికి పైగా ఉపాధి..

- 5 కోట్ల మందికి ఉపాధినిచ్చే రంగానికి అండ
- 2030 నాటికి రూ.9 లక్షల కోట్ల ఎగుమతుల లక్ష్యం
- నేతన్నల సంక్షేమానికి పలు కీలక పథకాలు
- వరంగల్ పీఎం మిత్ర పార్క్‌తో కొత్త ఊపు

02



## ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం, 08.08.2026
www.mudranews.in | @mudranews



### చిన్న చిన్న విషయాలు మర్చిపోతున్నారా?



విటమిన్ D కూడా కీలకంవిట మిన్ D తక్కువగా ఉంటే మెదడు పనితీరు ప్రభావితమై జ్ఞాపకశక్తి తగ్గే అవకాశం ఉంది. ఉదయం సూర్యర శ్మిలో కొంతసేపు ఉండండి.

# వరుణ యాగం



(మొదటిపేజీ తరువాయి)

ఈ మహా వరుణ యాగం కోసం ప్రత్యేకంగా 11 హోమకుండాలు ఏర్పాటు చేస్తున్నారు. యాదగిరిగుట్ట దేవస్థానానికి చెందిన ప్రధాన అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో 108 మంది రుత్వికులు వేదమంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా యాగ క్రతువులను నిర్వహించనున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగే యాగంలో వేదపారాయణాలు, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

రాష్ట్ర వ్యాప్తంగా సమయానికి వర్షాలు కురిసి రైతుల పంటలు సమృద్ధిగా పండాలని, అన్నదాతల కుటుంబాలు ఆనందంగా ఉండాలని, కరువు ఛాయలు తొలగిపోవాలని వేద పండితులు ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. కృష్ణా, గోదావరి నదులు ఉప్పొంగి ప్రవహించి సాగునీటి ప్రాజెక్టులు నిండాలని, భూగర్భ జలమట్టాలు పెరగాలని, ప్రతి గ్రామంలో చెరువులు నిండాలని సంకల్పిస్తారు.

ఈ మహా యాగానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. యాగ కార్యక్రమం రోజంతా కొనసాగి మధ్యాహ్నం 3.24 గంటలకు జరిగే మహా పూర్ణాహుతితో ముగియనుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేయనున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఈ మహా వరుణ యాగం ద్వారా ప్రకృతి అనుగ్రహం లభించి తెలంగాణలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, వ్యవసాయ రంగం పునరుజ్జీవం పొందాలని, జలాశయాలు నిండిపోవాలని, ప్రజల జీవితాల్లో సుభిక్షం వెల్లివిరియాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తోంది.

# ఆగస్టు అగ్నిపరీక్ష..!

(మొదటి పేజీ తరువాయి)

ఒకవేళ సాధారణ ప్రకటనలకే పరిమితమైతే యువత అసంతృప్తి మరింత పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

ఈ నేపథ్యంలో హోంమంత్రి అమిత్ షా పాత్ర కూడా కీలకంగా మారే అవకాశముంది. విద్యార్థి నిరసనలకు భద్రతా ఏర్పాట్లు, రాష్ట్రాలతో సమన్వయం, చట్ట–వ్యవస్థ నిర్వహణ, పరీక్షల అవకతవకలపై దర్యాప్తు, అవసరమైతే కేంద్ర సంస్థలతో విచారణ వంటి అంశాల్లో కేంద్రం వేగంగా స్పందించే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అదే సమయంలో నిరసనలపై అతిగా కఠిన వైఖరి అవలంబిస్తే అది ప్రభుత్వానికే ప్రతికూలంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

మరోవైపు కాంగ్రెస్ సహా ప్రతిపక్ష పార్టీలు పేపర్ లీకులు, నిరుద్యోగం, నియామకాలలో జాప్యం, విద్యార్థుల సమస్యలను ప్రధాన రాజకీయ అజెండాగా మార్చేందుకు సిద్ధమవుతున్నాయి. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, అఖిలేష్ యాదవ్ వంటి నేతలు ఈ అంశాలను పార్లమెంట్‌తో పాటు ప్రజాక్షేత్రంలోనూ బలంగా లేవనెత్తే అవకాశముందని తెలుస్తోంది. అయితే ఈ ఉద్యమం పూర్తిగా ఏ ఒక్క రాజకీయ పార్టీ ఆధీనంలోకి వెళ్లే



అవకాశం లేదని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

బిహార్‌లో జన సూరజ్ వంటి ప్రత్యామ్నాయ రాజకీయ శక్తుల ఎదుగుదల యువత అసంతృప్తి కొత్త రాజకీయ వేదికలకు కూడా అవకాశాలు కల్పిస్తోందని విశ్లేషణలు సూచిస్తున్నాయి. విద్య, ఉపాధి అంశాలపై కొత్త రాజకీయ ప్రత్యామ్నాయాల కోసం యువత ఎదురుచూస్తోందన్న సంకేతాలు కనిపిస్తున్నాయని పేర్కొంటున్నారు.

ఆర్థిక రంగంలోనూ కేంద్రానికి సవాళ్లు తక్కువగా లేవు. ద్రవ్యోల్బణం, ముడి చమురు ధరల పెరుగుదల, రూపాయి విలువలో హెచ్చుతగ్గులు, ప్రభుత్వ సంక్షేమ వ్యయం, ఉపాధి పథకాలు, రైతు సహాయ కార్యక్రమాలు, భద్రతా ఖర్చులు వంటి అంశాలు ప్రభుత్వంపై అదనపు ఆర్థిక ఒత్తిడిని సృష్టించే అవకాశముంది. మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు కొనసాగితే ఇంధన ధరల ప్రభావం కూడా దేశీయ ఆర్థిక పరిస్థితులపై పడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

అదే సమయంలో సరిహద్దు భద్రత, సైబర్ దాడులు, కమ్యూనికేషన్ వ్యవస్థల భద్రత వంటి అంశాల్లో కూడా కేంద్రం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని భద్రతా వర్గాలు సూచిస్తున్నాయి. దేశీయ రాజకీయ పరిణామాలతో పాటు అంతర్జాతీయ పరిస్థితులు కూడా కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలపై ప్రభావం చూపే అవకాశముందని భావిస్తున్నారు.

మొత్తంగా చూస్తే ఆగస్టు నెల కేంద్ర ప్రభుత్వానికి కీలక పరీక్షగా మారనుంది. యువత విశ్వాసాన్ని నిలబెట్టేలా ఉపాధి, పరీక్షల వ్యవస్థ, నియామకాలపై స్పష్టమైన నిర్ణయాలు తీసుకుంటే పరిస్థితిని చక్కదిద్దే అవకాశం ఉంది. లేకపోతే యువత అసంతృప్తి మరింత పెద్ద రాజకీయ ఉద్యమంగా మారే అవకాశాన్ని రాజకీయ విశ్లేషకులు కొట్టిపారేయడం లేదు.

# దేశంలో తెలంగాణ నెం. 1



**ముద్ర డెస్క్ :**
సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ప్రధాని కార్యాలయం ఆధ్వర్యంలోని ప్రగతి సమీక్షలో సైబర్ భద్రతకు సంబంధించిన తొమ్మిది కీలక పనితీరు ప్రమాణాల్లో తెలంగాణ అత్యుత్తమ రాష్ట్రంగా గుర్తింపు పొందిందని వెల్లడించారు. ఈ సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయెల్‌తో పాటు నగర పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలు, అధికారులు, సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే తొలిసారిగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ను ఏర్పాటు చేసి సైబర్ నేరాల నియంత్రణలో వినూత్న చర్యలు చేపట్టిందని డీజీపీ పేర్కొన్నారు. రూ.5 లక్షలకు పైబడిన సైబర్ మోసాల కేసుల్లో 49 ఈజీరో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం, ఫిర్యాదుల పరిష్కారంలో 88 శాతం, బాధితులకు డబ్బు తిరిగి అందించడంలో 81 శాతం విజయశాతం నమోదు చేయడం రాష్ట్ర పనితీరుకు నిదర్శనమన్నారు.

అలాగే SAHYOG పోర్టల్ వినియోగంలో 88 శాతం పనితీరు, 5,500 మంది సైబర్ నేరస్థుల ప్రొఫైళ్లను అప్‌లోడ్ చేయడం, 15 వేల అంతర్రాష్ట్ర నేర లింకులను గుర్తించడం, 524 మంది పోలీసు అధికారులకు సై ట్రెయిన్ ద్వారా ప్రత్యేక శిక్షణ అందించడం వంటి అంశాలు తెలంగాణను దేశంలో ఆదర్శ రాష్ట్రంగా నిలిపాయని తెలిపారు.

దేశవ్యాప్తంగా గుర్తించిన ప్రధాన సైబర్ క్రైమ్ హాట్‌స్పాట్ రాష్ట్రాల జాబితాలో తెలంగాణకు స్థానం లేకపోవడం రాష్ట్ర పోలీసుల సమర్థవంతమైన పనితీరుకు నిదర్శనమని డీజీపీ అన్నారు. ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంచేందుకు 8.5 లక్షల మందికి పైగా అవగాహన కార్యక్రమాలు, అదనంగా 2 లక్షల మందికి డిజిటల్ అరెస్ట్ మోసాలపై ప్రత్యేక ప్రచారం నిర్వహించినట్లు వెల్లడించారు. సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తూ, సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలబెట్టే దిశగా పోలీసులు మరింత సమర్థంగా పనిచేస్తారని డీజీపీ సీవీ ఆనంద్ విశ్వాసం వ్యక్తం చేశారు.

## స్కూల్ ఫీజుల నియంత్రణపై
# కీలక అడుగు



**ముద్ర హైదరాబాద్ :**
తెలంగాణ రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు, పారదర్శకతను పెంచేందుకు పాఠశాల విద్యాశాఖ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. 2026–27 విద్యాసంవత్సరానికి సంబంధించి అన్ని ప్రైవేట్ యాజమాన్యాలు తమ పాఠశాలల్లోని తరగతుల వారీ ఫీజు వివరాలను తప్పనిసరిగా బహిరంగపరచాలని స్పష్టం చేసింది. ఇందులో భాగంగా ప్రతి ప్రైవేట్ పాఠశాల తమ ఫీజుల వివరాలను ప్రాంగణంలోని నోటీస్ బోర్డుపై స్పష్టంగా ప్రదర్శించడంతో పాటు పాఠశాల అధికారిక వెబ్‌సైట్‌లోనూ ఉంచాల్సి ఉంటుంది. అంతేకాకుండా.. విద్యాశాఖ అధికారిక పోర్టల్ schooledu.telangana.gov.in లో కూడా ఈ వివరాలను అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది. ఫీజులను ఏ ఆధారంగా నిర్ణయించారో తెలిపే పత్రాలను, గవర్నింగ్ బాడీ సభ్యుల సంతకాలతో కూడిన తీర్మాన ప్రతులను కూడా పోర్టల్‌లో దాఖలు చేయడం తప్పనిసరి చేశారు. జీఓ ఎంఎస్ నెం.1 (1994)లోని 16, 18 నిబంధనల ప్రకారం ఫీజు వివరాలను ప్రదర్శించని పాఠశాలలకు జిల్లా విద్యాధికారులు (DEO) తక్షణమే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేశారు.

ఈ నిబంధనలను ఉల్లంఘించే పాఠశాలలపై జీఓ ఎంఎస్ నెం.1 లోని రూల్ 11 ప్రకారం పాఠశాల అనుమతులు లేదా గుర్తింపు రద్దు చేయడం వంటి కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ ఉత్తర్వుల అమలును జిల్లా విద్యాధికారులు మరియు ప్రాంతీయ సంయుక్త డైరెక్టర్లు (RJD) నిరంతరం పర్యవేక్షించాలని, తల్లిదండ్రులపై ఎలాంటి అదనపు ఆర్థిక భారం పడకుండా పారదర్శకతను కాపాడాలని విద్యాశాఖ ఆదేశించింది

## ఈఎంఐ కట్టకపోతే
# ఫోన్ లాక్

**ముద్ర డెస్క్:**
లోన్‌పై మొబైల్, ల్యాప్‌టాప్ లేదా ట్యాబ్ కొనుగోలు చేసి ఈఎంఐలను సకాలంలో చెల్లించకపోతే ఆయా డివైజ్‌లను లాక్ చేసే అవకాశం లెండర్స్‌కు కల్పిస్తూ RBI కొత్త మార్గదర్శకాలు తీసుకొచ్చింది. ఈ నిబంధనలు 2027 జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి. కొత్త రూల్స్ ప్రకారం, EMI మిస్సయి 30 రోజులు పూర్తయితే డివైజ్‌ను పాక్షికంగా (Partial Lock) లాక్ చేయవచ్చు. 60 రోజుల పాటు చెల్లింపు లేకపోతే పూర్తిగా (Full Lock) చేసే అవకాశం ఉంటుంది. అయితే వినియోగదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఇన్‌కమింగ్ కాల్స్, SMSలు, ఎమర్జెన్సీ కమ్యూనికేషన్, ఉద్యోగం లేదా ఉపాధికి అవసరమైన కొన్ని కీలక ఫీచర్లు మాత్రం అందుబాటులో ఉంటాయి.



అత్యంత ముఖ్యమైన విషయం ఏంటంటే, లెండర్స్‌కు వినియోగదారుల వ్యక్తిగత డేటాపై ఎలాంటి యాక్సెస్ ఉండదు. ఫోన్‌లోని ఫొటోలు, వీడియోలు, కాంటాక్ట్స్ లేదా ఇతర వ్యక్తిగత సమాచారాన్ని వారు చూడలేరు. డివైజ్‌ను లాక్ చేసే హక్కు మాత్రమే ఉంటుంది. డిజిటల్ లోన్లు, EMI ఫైనాన్స్ ద్వారా ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోళ్లు పెరుగుతున్న నేపథ్యంలో రుణ బకాయిల వసూళ్లను సులభతరం చేయడం, వినియోగదారులు EMIలను సమయానికి చెల్లించేలా ప్రోత్సహించడమే ప్రధాన ఉద్దేశమని భావిస్తున్నారు.

# 5 కోట్ల మందికి పైగా ఉపాధి..

**ముద్ర, ఢిల్లీ:**
జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నేతన్నలకు శుభాకాంక్షలు తెలుపుతూ కీలక ప్రకటన చేశారు. భారత ఆర్థిక వ్యవస్థలో చేనేత, వస్త్ర పరిశ్రమ అత్యంత కీలకమైన భాగమని ఆయన స్పష్టం చేశారు. వ్యవసాయం తర్వాత దేశంలో దాదాపు 5 కోట్ల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న అతిపెద్ద రంగం ఇదేనని, ఇది దేశానికి గణనీయమైన విదేశీ మారకద్రవ్యాన్ని సమకూరుస్తోందని చెప్పారు.

ఈ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 'మేక్ ఇన్ ఇండియా'తో పాటు 5F విజన్ (ఫామ్ టు ఫైబర్, ఫైబర్ టు ఫ్యాబ్రిక్, ఫ్యాబ్రిక్ టు ఫ్యాషన్, ఫ్యాషన్ టు ఫారిన్) అమలు చేస్తున్నట్లు తెలిపారు. భారతదేశాన్ని ప్రపంచ వస్త్ర కేంద్రంగా మార్చే లక్ష్యంతో 2030 నాటికి ఎగుమతులను రూ.9 లక్షల కోట్లకు పెంచాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు.

పీఎల్ఐ (PLI) పథకం, పీఎం మిత్ర పార్కులు, నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, రా మెటీరియల్ సప్లయ్ స్కీమ్, వీవర్స్ ముద్రా స్కీమ్ ద్వారా నేత కార్మికులకు ఆధునిక మగ్గాలు, ముడిసరుకు, రుణాలు, మార్కెటింగ్ సౌకర్యాలు, సామాజిక భద్రత కల్పిస్తున్నట్లు తెలిపారు.

తెలంగాణలోని వరంగల్‌లో పీఎం మిత్ర మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటు చేయడమే కాకుండా, పత్తి రైతుల నుంచి మద్దతు ధర (MSP) కింద కేంద్రం రూ.69,860 కోట్లకు పైగా ఖర్చు చేసిందని చెప్పారు. చేనేత రంగానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), ఆటోమేషన్ వంటి ఆధునిక సాంకేతికతను అనుసంధానిస్తూ ఉత్పాదకత, నాణ్యతను పెంచుతున్నామని పేర్కొన్నారు. సంప్రదాయ కళను కాపాడుతూ నేతన్నను ఆదుకునేందుకు కేంద్రం కట్టుబడి ఉందని, ప్రతి ఒక్కరూ చేనేతను ప్రోత్సహించాలని కోరారు.

# పెట్రోల్‌కు నై.. ఈవీలకు జై!

**ముద్ర డెస్క్:**
భారత ఆటోమొబైల్ రంగంలో వినియోగదారుల అభిరుచులు వేగంగా మారుతున్నాయి. ఒకప్పుడు పెట్రోల్ కార్లకే ఎక్కువ డిమాండ్ ఉండగా, ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారుతోంది. ఎలక్ట్రిక్ (EV), CNG, హైబ్రిడ్ వాహనాల వైపు వినియోగదారులు పెద్దఎత్తున మొగ్గు చూపుతున్నారు. ఇంధన ధరలు పెరగడం, పర్యావరణంపై పెరుగుతున్న అవగాహన, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, కొత్త టెక్నాలజీ అందుబాటులోకి రావడం వంటి కారణాలతో ప్రత్యామ్నాయ ఇంధన వాహనాల మార్కెట్ వేగంగా విస్తరిస్తోంది.

తాజా గణాంకాల ప్రకారం 2026, జులైలో దేశవ్యాప్తంగా ప్యాసింజర్ వాహనాల రిటైల్ అమ్మకాల్లో CNG, హైబ్రిడ్, ఎలక్ట్రిక్ వాహనాల కలిపిన మార్కెట్ వాటా 40.6 శాతానికి చేరుకుంది. అదే సమయంలో పెట్రోల్ వాహనాల వాటా 41.7 శాతంగా నమోదైంది. అంటే ఈ రెండింటి మధ్య తేడా ఒక శాతానికి మాత్రమే పరిమితమైంది. గతేడాది ఇదే సమయంలో తేడా 13.2 శాతం ఉండటం గమనార్హం. ఇది భారత ఆటోమొబైల్ మార్కెట్‌లో చోటు చేసుకుంటున్న భారీ మార్పునకు సంకేతంగా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.





ముఖ్యంగా పెట్రోల్ కార్ల మార్కెట్ వాటా ఏడాదిలోనే 47.6 శాతం నుంచి 41.6 శాతానికి పడిపోవడం గమనించాల్సిన అంశం. మరోవైపు CNG కార్లు తక్కువ నిర్వహణ ఖర్చుతో పాటు మెరుగైన మైలేజీ అందిస్తుండగా, హైబ్రిడ్ కార్లు ఇంధన వినియోగాన్ని తగ్గిస్తున్నాయి. ఎలక్ట్రిక్ కార్లు అయితే పెరుగుతున్న ఛార్జింగ్ మౌలిక వసతులు, కొత్త మోడళ్ల లాంచ్‌లు, దీర్ఘకాలిక ఖర్చు తగ్గింపు వంటి కారణాలతో మరింత ప్రజాదరణ పొందుతున్నాయి.

కేవలం కార్లే కాదు, ద్విచక్ర వాహనాల మార్కెట్‌లో కూడా ఎలక్ట్రిక్ విప్లవం స్పష్టంగా కనిపిస్తోంది. ఏడాది క్రితం 7.7 శాతంగా ఉన్న ఎలక్ట్రిక్ బైకుల రిటైల్ అమ్మకాల వాటా ప్రస్తుతం 11.2 శాతానికి పెరిగింది. నగరాల్లో రోజువారీ ప్రయాణాలకు తక్కువ ఖర్చుతో కూడిన ప్రత్యామ్నాయంగా ఈవీ స్కూటర్లు, బైకులు మారుతున్నాయి. పెట్రోల్ ధరల భారం తగ్గించుకోవాలనే ఆలోచన కూడా వినియోగదారులను ఈవీల వైపు ఆకర్షిస్తోంది.

ప్రభుత్వం కూడా ఈ మార్పుకు ఊతమిస్తోంది. ఎలక్ట్రిక్ మొబిలిటీని ప్రోత్సహించే విధానాలు, ఛార్జింగ్ స్టేషన్ల విస్తరణ, దేశీయ తయారీకి ప్రాధాన్యం, బ్యాటరీ టెక్నాలజీలో వస్తున్న పురోగతి ఈవీ రంగం అభివృద్ధికి బలాన్నిస్తున్నాయి. ఆటోమొబైల్ కంపెనీలు కూడా వరుసగా కొత్త ఎలక్ట్రిక్, హైబ్రిడ్, CNG మోడళ్లను మార్కెట్లోకి తీసుకువస్తుండటంతో వినియోగదారులకు ఎంపికలు పెరుగుతున్నాయి.

# చావడానికో హోటల్

**ముద్ర, డెస్క్ :**
సాధారణంగా ఏవరైనా ప్రత్యేక ప్రదేశాల్లోకి వెళ్లినప్పుడు హోటల్ బుక్ చేసుకుంటారు. ఇందులో కాసేపు విశ్రాంతి తీసుకుంటారు. లేదా కొన్ని రోజుల పాటు ఉంటారు. కానీ ఇక్కడ ఉన్న ఓ హోటల్ కేవలం మరణించే వారికి మాత్రమే. త్వరలో చనిపోయే వారి కోసమే దీనిని నిర్మించారు. ఇక్కడికి వచ్చిన వారు కొన్ని రోజుల్లో మరణిస్తారు.. !అంటే తమ చావు త్వరలో అని తెలిసిన వారు ఈ హోటల్ లో బస చేయవచ్చు. ఇంత విచిత్రమైన హోటల్ ఎక్కడుంది? ఎందుకు ఇలా దీనిని నిర్మించారు?

**'ముక్తి భవన్' గురించి చర్చ..**
భారతదేశంలోని అత్యంత పవిత్రమైన నగరాల్లో ఒకటైన వారణాసిలో ఉన్న 'ముక్తి భవన్' గురించి ఇటీవలి కాలంలో సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఇది సాధారణ హోటల్ కాదు. జీవితపు చివరి రోజులను గడిపేందుకు.. కాశీలోనే చివరి శ్వాస విడిచి మోక్షం పొందాలనే వారికి నిర్మించింది. వారణాసిలో గంగానది ఒడ్డుపై ఉన్న ముక్తి భవన్ దశాబ్దాలుగా కొనసాగుతున్న ఒక సేవా సంస్థ. దీనిని కొందరు "కాశీ లాభ్ ముక్తి భవన్" అని కూడా పిలుస్తారు. దీని ప్రధాన ఉద్దేశం మరణం సమీపించిందని భావించే వృద్ధులకు తాత్కాలికంగా నివాసం కల్పించడం. ఇక్కడికి వచ్చే వారు తమ కుటుంబ సభ్యులతో కలిసి చివరి రోజులను ఆధ్యాత్మిక వాతావరణంలో గడుపుతారు. భవనంలో భజనలు, వేద మంత్రాల పఠనం, పూజలు జరుగుతుంటాయి.

**14 రోజులు మాత్రమే అనుమతి..**
ముక్తి భవన్‌లో గదుల సంఖ్య చాలా పరిమితంగా ఉంటుంది. అందుకే సాధారణంగా ఒక వ్యక్తికి గరిష్ఠంగా 14 రోజుల పాటు మాత్రమే ఉండేందుకు అనుమతి ఇస్తారు. ఈ కాలంలో వ్యక్తి మరణిస్తే అక్కడే చివరి కార్యక్రమాలకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేసుకుంటారు. అయితే 14 రోజుల తర్వాత కూడా ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉంటే లేదా మరణం సంభవించకపోతే, ఇతరులకు అవకాశం కల్పించేందుకు భవనాన్ని ఖాళీ చేయాల్సి ఉంటుంది. ప్రత్యేక పరిస్థితుల్లో నిర్వాహకులు కొద్దిరోజులు అదనపు గడువు ఇచ్చిన సందర్భాలు కూడా ఉన్నాయని చెబుతారు.

**40 ఏళ్లలో 12 వేల మందికి పైగా..**
ముక్తి భవన్ నిర్వాహకుల్లో ఒకరైన వ్యక్తి మీడియాతో పలు సందర్భాల్లో మాట్లాడుతూ, తాను దాదాపు 40 సంవత్సరాలుగా ఈ సేవలో ఉన్నానని, ఆ కాలంలో 12 వేల మందికి పైగా చివరి శ్వాస విడిచిన దృశ్యాలను ప్రత్యక్షంగా చూశానని పేర్కొన్నారు. ప్రతి వ్యక్తి చివరి క్షణాల్లో జీవితం గురించి లోతుగా ఆలోచిస్తారని, అనేక భావోద్వేగాలను వ్యక్తం చేస్తారని ఆయన వివరించారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 08.08.2026
www.mudranews.in | @mudranews



చిన్న చిన్న విషయాలు మర్చిపోతున్నారా?
ఫోలేట్ (విటమిన్ B9) లోపం ఉండొచ్చు. ఫోలేట్ తక్కువగా ఉంటే మెదడు పనితీరు మందగించవచ్చు. ఆకుకూరలు, పప్పుధాన్యాలు ఆహారంలో చేర్చండి.




# మిత్రపక్షంపై తిరుగుబాట ?

- కొత్తగూడెం రాజకీయంలో కాంగ్రెస్
- సీపీఐ మధ్య తీవ్రమైన కాక
- సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని ఘాటు వ్యాఖ్యలు




**ముద్ర ప్రతినిధి, ఖమ్మం 7** :తెలంగాణ రాష్ట్రంలో అధికార కాంగ్రెస్, మిత్రపక్షమైన సీపీఐ మధ్య రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఏర్పడిన రాజకీయ అవగాహన, స్నేహబంధం ప్రస్తుతం స్థానిక ఆధిపత్య పోరుతో తీవ్ర ఘర్షణ వాతావరణానికి దారి తీస్తోంది. ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం నియోజకవర్గం కేంద్రంగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వేస్తున్న వ్యూహాత్మక అడుగులు, దానికి ప్రతిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన హెచ్చరికలు తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి.

**ప్రజా చైతన్య యాత్ర ప్రారంభ సభలో హెచ్చరికల కలకలం**

రాజకీయ శ్రేణుల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. కమ్యూనిస్టులను తక్కువ అంచనా వేసి 'మొక్కే కదా' అని పీకేయాలని చూస్తే... పీక కోస్తాం" అంటూ సిపిఐ నేత కూనంనేని అత్యంత ఘాటుగా హెచ్చరించారు. బీజేపీ వంటి మతోన్మాద పార్టీలను నిరోధించేందుకే కాంగ్రెస్ కు మద్దతు ఇచ్చామని, తాము స్నేహ ధర్మాన్ని పాటిస్తున్నామని, మీరు కూడా పాటించాలని ఆయన అన్నారు. తమని అవమానిస్తే గతంలో బిఆర్ఎస్ పార్టీకి పట్టిన గతే కాంగ్రెస్ కూ పడుతుందని హెచ్చరించారు.మిత్ర ధర్మం పాటించకపోతే మిమ్మల్ని రక్షించేవాడు ఎవడు ఉండడు అంటూ కాంగ్రెస్ పార్టిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. మీ పతనానికి మీరే శిలాఫలకం రాసుకుంటే, మీ శవపేటికను మీరే తయారు చేసుకున్నట్లే అంటూ ఘాటుగా విమర్శించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మిత్ర పక్షం పై ఏందుకు ఇంత ఘాటు గా వ్యాఖ్యలు చేశారనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా జరుగుతోంది. కూనంనేని ప్రాతినిధ్యం వహిస్తున్న కొత్తగూడెంలో కాంగ్రెస్ పార్టీ ని బలోపేతం చేసేందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆయన వియ్యంకుడు ఎంపి రఘురాంరెడ్డి లు అభివృద్ధి కార్యక్రమాల్లో జోక్యం పెరగటమే కారణమని భావిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల నాటినుండి ఇద్దరి మధ్య విభేదాలు పొడచూపి ఇప్పుడు తీవ్రస్థాయిలో అసమ్మతి నెలకొంది.

**పొంగులేటి వర్సెస్, సీపీఐ ఆధిపత్యం**

ఈ వివాదానికి కొత్తగూడెం నియోజకవర్గంలో జరుగుతున్న అంతర్గత రాజకీయ సమీకరణలే ప్రధాన మూలంగా కనిపిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల పొత్తులో భాగంగా సీపీఐకి కేటాయించిన ఈ స్థానం నుంచి కూనంనేని సాంబశివరావు విజయం సాధించారు. అయితే, స్థానికంగా కాంగ్రెస్ పార్టీని బలపరిచే క్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కొత్తగూడెం నుంచి భవిష్యత్తులో పోటీ చేసే ఆలోచనతో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారని సీపీఐ వర్గాలు భావిస్తున్నాయి.

ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల వేళల్లో కూడా సీపీఐ స్థానాన్ని బలహీనపరిచేందుకు పొంగులేటి జరిపిన ప్రయత్నాలు వికటించినప్పటికీ, ఆయన తన వైఖరిని మార్చుకోకుండా సీపీఐ నేతలను, కేడర్ ను టార్గెట్ చేస్తున్నారని సీపీఐ ఆరోపిస్తోంది. కూనంనేని తీవ్ర వ్యాఖ్యలు కేవలం ఆవేశంతో చేసినవి కావని, కేడర్ లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు, కాంగ్రెస్ అధిష్టానానికి హెచ్చరిక పంపేందుకు ఉద్దేశించిన వ్యూహాత్మక అడుగులుగా భావిస్తున్నారు.

కొత్తగూడెం నియోజకవర్గానికి నిధుల కేటాయింపు, అధికారుల ఏకపక్ష వైఖరి పై కూనంనేని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా, అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినా కాంగ్రెస్ నేతలు పట్టించుకోకపోవడంతో ఈ వివాదం తీవ్ర స్థాయికి చేరిందనే చర్చ జరుగుతోంది. స్థానికంగా కాంగ్రెస్ నాయకుల నుంచి వస్తున్న ఒత్తిళ్లను తట్టుకుని నిలబడేలా సీపీఐ శ్రేణులకు ఎమ్మెల్యే పూర్తి భరోసానిచ్చేందుకే కూనంనేని బహిరంగ వ్యాఖ్యలు చేశారని సిపిఐ శ్రేణులు అంటున్నాయి.

స్థానిక నేతలు, మంత్రులు పొత్తు ధర్మాన్ని ఉల్లంఘిస్తే రాష్ట్ర స్థాయిలో కూటమి మనుగడకే ప్రమాదమని కూనంనేని స్పష్టం చేశారు. మిత్రపక్షాల మధ్య తలెత్తిన ఈ ఆధిపత్య పోరు కాంగ్రెస్ అధిష్టానానికి సవాలుగా మారే అవకాశం ఉంది. ఒకవైపు మంత్రి పొంగులేటి తన స్థానాన్ని విస్తరించుకోవాలని చూస్తుంటే, మరోవైపు సీపీఐ తమ స్థానాన్ని వదులుకోవడానికి సిద్ధంగా లేదు. కాంగ్రెస్ పెద్దలు తక్షణమే జోక్యం చేసుకుని పొత్తు ధర్మాన్ని కాపాడకపోతే, కొత్తగూడెం మిత్రపక్షాల ఘర్షణ రాష్ట్ర స్థాయి రాజకీయాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఎల్‌నినో నేపథ్యంలో రైతులకు ముందస్తు సూచనలు

– ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ముద్ర, హైదరాబాద్ :** ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా రైతుల ప్రయోజనాల కోసం జిల్లా నీటిపారుదల సలహా మండళ్లను వెంటనే పునరుద్ధరించాలని నీటి పారుదల, పౌర సరఫరా ల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో ప్రతి పంట సీజన్ కు ముందు మండళ్ల సమావేశాలు నిర్వహించి జలాశయాల నీటి నిల్వలు, వర్షపాతం అంచనాలు, సాగునీటి లభ్యతపై సమీక్షించి రైతులకు శాస్త్రీయ మార్గదర్శకాలు ఇవ్వాలని సూచించారు. నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు ఇంకా తక్కువగా ఉన్నందున అధిక నీటి అవసరమయ్యే వరి సాగులో అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన చోట ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి నిల్వలకు ప్రాధాన్యం ఇవ్వాలని కూడా అధికారులను ఆదేశించారు. అదే సమావేశంలో పౌర సరఫరాల శాఖపై సమీక్ష నిర్వహించిన మంత్రి, రాష్ట్రంలో ప్రస్తుతం 1.06 కోట్ల రేషన్ స్మార్ట్ కార్డుల ద్వారా 3.42 కోట్ల మంది లబ్ధిదారులకు ప్రతి నెల ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీని ఆగస్టు 15న సంగారెడ్డిలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని వెల్లడించారు.

## తెలంగాణలో బీజేపీని గెలిపించడమే లక్ష్యం

ఈటల రాజేందర్



**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణలో భారతీయ జనతా పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యమని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఢిల్లీలో జరిగిన బీజేపీ జాతీయ నాయకత్వ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణపై ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ పార్టీని బలోపేతం చేయాలని అధిష్ఠానం సూచించిందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయలేదని విమర్శించిన ఆయన, తెలంగాణను అప్పుల ఊబి నుంచి గట్టెక్కించేందుకు బీజేపీకి ప్రజలు అవకాశం ఇవ్వాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు.

## ట్రంప్ పౌరసత్వ'అస్త్రం'

- బర్త్‌రైట్ సిటిజన్‌షిప్‌పై కొత్త ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు..

**ముద్ర డెస్క్** :అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వలస విధానాలను మరింత కఠినతరం చేస్తూ రెండు కొత్త ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై సంతకం చేశారు. అమెరికాలో జన్మించిన ప్రతి శిశువుకు ఆటోమేటిక్‌గా పౌరసత్వం లభించే బర్త్‌రైట్ సిటిజన్‌షిప్ను పరిమితం చేయడంతో పాటు, బర్త్ టూరిజం పేరుతో జరిగే అక్రమ పౌరసత్వ ప్రయత్నాలను అడ్డుకోవడమే వీటి లక్ష్యం. తాత్కాలిక వీసాలపై ఉన్నవారు, అక్రమంగా దేశంలోకి వచ్చిన వారి పిల్లలకు పౌరసత్వంపై కొత్త నిబంధనలు తీసుకురానున్నారు. అలాగే గర్భిణీలు టూరిస్ట్ వీసాలపై వచ్చి ప్రసవించే ధోరణిని అరికట్టేందుకు వీసా జారీ, ఇమ్మిగ్రేషన్ తనిఖీలను కఠినతరం చేయాలని ఆదేశించారు.అయితే అమెరికా రాజ్యాంగం లోని 14వ సవరణ ప్రకారం దేశంలో జన్మించిన వారికి పౌరసత్వ హక్కు ఉండటంతో, ఈ నిర్ణయాలు కోర్టుల్లో సవాల్ చేసే అవకాశముంది.

## త్వరలోనే డిజిటల్ అసెంబ్లీ, డిజిటల్ కౌన్సిల్..

- మంత్రి శ్రీధర్ బాబు కీలక ప్రకటన

**ముద్ర, హైదరాబాద్ :** రాష్ట్రంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పాలనను మరింత వేగవంతం, పారదర్శకం చేసేందుకు ప్రభుత్వం అనేక విప్లవాత్మక డిజిటల్ కార్యక్రమాలను చేపడుతోందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. శాసనసభ, మండలి వ్యవహారాలను సంపూర్ణంగా డిజిటలైజ్ చేస్తూ త్వరలోనే డిజిటల్ అసెంబ్లీ, డిజిటల్ కౌన్సిల్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. GOVconnect, ఎలక్ట్రానిక్ సర్వీసెస్ డెలివరీ (మీసేవ) సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన "ఏఐ ట్రాన్స్‌ఫార్మేషన్ కాంక్లేవ్ (తెలంగాణ)"ను ప్రారంభించిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి ప్రసంగించారు. డిజిటల్ ఆఫీస్ ప్రాజెక్ట్ ద్వారా ప్రభుత్వ శాఖల్లో పేపర్ లెస్ పాలనకు పెద్దపీట వేస్తున్నామని, నకిలీ పత్రాలకు తావులేకుండా భద్రమైన బ్లాక్‌చెయిన్ ఆధారిత సర్టిఫికెట్ల సేవలను త్వరలో అందుబాటులోకి తేనున్నట్లు ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల సాధికారత లక్ష్యంగా టీ-ఫైబర్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 80 లక్షలకు పైగా గ్రామీణ కుటుంబాలకు హైస్పీడ్ డిజిటల్ కనెక్టివిటీని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. పాలనా వ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), క్లౌడ్ కంప్యూటింగ్, డేటా అనలిటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతలను విస్తృతంగా వినియో గిస్తున్నట్లు పేర్కొన్నారు. దాదాపు 20కి పైగా ప్రధాన ప్రభుత్వ శాఖలను ఒకే వేదికపైకి తెచ్చి, పథకాల అమలును నిరంతరం పర్యవేక్షించేందుకు రియల్ టైమ్ గవర్నమెంట్ డ్యాష్ బోర్డును రూపొందిస్తున్నట్లు మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర సీఎంవో చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్ ప్రవీణ్ పరదేశి, సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఎండీ జీవీఎల్ సత్య కుమార్, నేషనల్ ఇంటర్నెట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా సీఈవో డాక్టర్ దేవేష్ త్యాగి, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ అడిషనల్ సెక్రటరీ సౌరభ్ కె.తివారీలతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సామాజిక న్యాయ తెలంగాణకు కవితే రథసారథి

- టీఆర్ఎస్ నేతలు

**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత నాయకత్వంలోనే రాష్ట్రంలో సామాజిక న్యాయం సాధ్యమవుతుందని టీఆర్ఎస్ నేతలు రూప్ సింగ్, ఇస్మాయిల్ అన్నారు. బంజారాహిల్స్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, సరూర్‌నగర్‌లో జరిగిన సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ విజయవంతమైందని తెలిపారు. సభలో కవిత చేసిన ప్రసంగం అన్ని వర్గాలను ఆలోచింపజేసిందని పేర్కొన్నారు. సామాజిక న్యాయం సాధనకు ఇది తొలి అడుగేనని, భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. సభ విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. మీడియా సమావేశంలో టీఆర్ఎస్ సీనియర్ నేత రవిచంద్ర పాల్గొన్నారు.

## భారత రక్షణ ఇక మరింత బలోపేతం

- 94 రఫేల్ జెట్లు భారత్‌లోనే తయారీ!
- మేక్ ఇన్ ఇండియాకు ఫ్రాన్స్ భారీ బూస్ట్



**ముద్ర డెస్క్ :** భారత వాయుసేన యుద్ధ విమానాల కొరతను తీర్చేందుకు ఫ్రాన్స్ రూ.3.25 లక్షల కోట్లతో 114 రఫేల్ జెట్ల ప్రతిపాదన సమర్పించింది. ఇందులో 94 విమానాలను భారత్ లోనే తయారు చేయాలని ప్రతిపాదించడంతో ఇది మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర భారత్ లక్ష్యాలకు కీలక అడుగుగా మారనుంది. టెక్నాలజీ బదిలీతో ఎయిర్ ఫ్రేమ్ , ఇంజిన్లు, అవయోనిక్స్ లో స్థానిక ఉత్పత్తి పెరిగి స్వదేశీ రక్షణ రంగానికి బలం చేకూరే అవకాశం ఉంది.

ఈ ఒప్పందం అమలైతే భారత కంపెనీలకు సుమారు రూ.1.6 లక్షల కోట్ల వ్యాపార అవకాశాలు లభిస్తాయని అంచనా. టాటా అడ్వాన్స్ డ్ సిస్టమ్స్ , ఎల్ అండ్ టీ వంటి సంస్థలు తయారీ ప్రక్రియలో భాగస్వామ్యం కానుండగా, హైదరాబాద్ లో రఫేల్ విడిభాగాల తయారీ, ఎంఆర్ వో కేంద్రాలు ఏర్పడే అవకాశముంది. దీంతో తెలంగాణలో పెట్టుబడులు, ఉపాధి పెరుగుతాయి.

ప్రస్తుతం ఉన్న 36 రఫేల్ లకు అదనంగా కొత్త జెట్లు చేరితే భారత వాయుసేన సామర్థ్యం మరింత బలపడుతుంది. అయితే ఈ ప్రతిపాదనపై రక్షణ శాఖ, వాయుసేన ధర, టెక్నాలజీ బదిలీ, స్వదేశీ కంటెంట్ వంటి అంశాలను పరిశీలిస్తున్నాయి. ఒప్పందం ఖరారైతే భారత్ –ఫ్రాన్స్ రక్షణ సహకారంలో కొత్త అధ్యాయం ప్రారంభం కానుంది.

## సీఎం రేవంత్‌తో ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్ భేటీ



**ముద్ర, హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రముఖ భారత ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్‌తో సమావేశమ య్యారు. ఈ సందర్భంగా ఎక్సైజ్, జీఎస్టీ సంస్కరణలు, రాష్ట్ర ఖజానాకు ఆదాయం పెంచడంతో పాటు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను మెరుగుపరిచే మార్గాలపై చర్చించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రణాళికాబద్ధంగా మరింత బలోపేతం చేసే అంశాలపై కూడా అభిప్రాయాలు పంచుకున్నారు. సమావేశంలో సీఎం సలహాదారు కె. రామకృష్ణా రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, కమర్షియల్ టాక్స్ & ఎక్సైజ్ కార్యదర్శి రఘునందన్ రావు, ఎక్సైజ్ కమిషనర్ హరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

శాసనసభ, శాసనమండలిని సందర్శించిన

## ఒడిస్సా స్టాండింగ్ కమిటీ



ముద్ర, హైదరాబాద్: స్టడీ టూర్‌లో భాగంగా ఒడిస్సా అసెంబ్లీ శాఖల సంబంధిత స్టాండింగ్ కమిటీ సభ్యులు తెలంగాణ రాష్ట్ర శాసనమండలి, శాసనసభను శుక్రవారం సందర్శించారు. ఒడిస్సా స్టాండింగ్ కమిటీ చైర్మన్ సుధీర్ రంజన్ పథజోషి నేతృత్వంలో వచ్చిన ప్రతినిధి బృందానికి తెలంగాణ శాసనమండలి సమావేశ మందిరంలో ఘన స్వాగతం లభించింది. తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ సభ్యులను పుష్పగుచ్ఛాలతో ఆహ్వానించి, శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సెక్రటరీ డాక్టర్ వి. నరసింహాచార్యులు, అసెంబ్లీ సెక్రటరీ రేండ్ల తిరుపతి, శాసనసభ, శాసనమండలి అధికారులు పాల్గొన్నారు.అనంతరం నిర్వహించిన సమావేశంలో తెలంగాణ, ఒడిస్సా రాష్ట్రాల శాసనసభలు, శాసనమండలిలో ఏర్పాటు చేసిన వివిధ స్టాండింగ్ కమిటీల నిర్మాణం, విధులు, పనితీరు, శాసన ప్రక్రియలో వాటి పాత్రపై ఇరు రాష్ట్రాల ప్రతినిధులు విస్తృతంగా చర్చించారు. ఇలాంటి అధ్యయన పర్యటనలు ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు.

## చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి తుమ్మల




**ముద్ర, హైదరాబాద్ :** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వేడుకల్లో రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత & జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 100కు పైగా చేనేత స్టాల్స్ ను ప్రారంభించి పరిశీలించిన మంత్రి, కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత పురస్కార గ్రహీతలను ఘనంగా సత్కరించారు. చేనేత అనేది కేవలం ఉపాధి మార్గం మాత్రమే కాకుండా భారతీయ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక అని మంత్రి పేర్కొన్నారు. రైతన్నకు, నేతన్నకు సమాన ప్రాధాన్యం ఇస్తూ వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. గద్వాల, పోచంపల్లి, నారాయణపేట, సిద్దిపేట, వరంగల్, కరీంనగర్ చేనేత ఉత్పత్తులు ప్రపంచవ్యాప్తంగా తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చాయని చెప్పారు.

చేనేత కార్మికుల సంక్షేమం కోసం నేతన్న పొదుపు, నేతన్న భద్రత, నేతన్న భరోసా, నేతన్నకు చేయూత వంటి పథకాల ద్వారా భారీగా నిధులు విడుదల చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. చేనేత రుణమాఫీ, యార్న్ డిపో ఏర్పాటు, పెండింగ్ బకాయిల చెల్లింపులు, ఆధునిక శిక్షణ కార్యక్రమాల ద్వారా చేనేత రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు.

ఆగస్టు 7 నుంచి 16 వరకు కొనసాగనున్న చేనేత వస్త్ర ప్రదర్శనను ప్రజలు పెద్ద ఎత్తున సందర్శించి చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి నేతన్నలను ప్రోత్సహించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి దనసరి అనసూయ (సీతక్క), జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్, టెస్కో అధికారులు, చేనేత రంగ ప్రముఖులు, అవార్డు గ్రహీతలు, చేనేత సహకార సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## బహరేన్‌లో తెలంగాణ ప్రవాసులకు అండగా కోటగిరి నవీన్




**ముద్ర, హైదరాబాద్ :** బహరేన్‌లో కష్టాల్లో ఉన్న తెలంగాణ ప్రవాసులకు నిస్వార్థంగా సేవలందిస్తున్న నిజామాబాద్ జిల్లా కమ్మర్పల్లి మండలం హాస కొత్తూరు గ్రామానికి చెందిన సమాజ సేవకుడు కోటగిరి నవీన్ కుమార్‌ను సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్ శాలువాతో ఘనంగా సన్మానించారు. శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో జరిగిన కార్యక్రమంలో నవీన్ సేవలను అభినందించిన వారు, భవిష్యత్తులో కూడా ప్రవాస తెలంగాణవారికి ఆయన సేవలు కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఆర్ ఐ సలహా మండలి వైస్ చైర్మన్ మంద భీం రెడ్డి కూడా పాల్గొన్నారు.

## నాణ్యమైన మందులపై రాజీ లేదు: యూఎస్ ఎఫ్‌డీఏ

ముద్ర, అమరావతి : విజయవాడలో ఏపీ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో యూఎస్ ఎఫ్‌డీఏ ఇండియా కంట్రీ డైరెక్టర్ గ్రెగరీ స్మిత్ మాట్లాడుతూ, ఔషధ తయారీ సంస్థల్లో జరిగే ప్రతి తనిఖీ, ప్రయోగశాల పరీక్ష రోగుల భద్రతకు కీలకమని అన్నారు. విధివిధానాల అమలు, ప్రయోగశాల నియంత్రణల్లో పటిష్ఠత అవసరమని సూచించారు. అమెరికాకు ఎగుమతి అయ్యే మందుల తయారీలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి జి. వీరపాండియన్ మాట్లాడుతూ మందుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, నాసిరకం మందులపై 'జీరో టాలరెన్స్' విధానం కొనసాగుతుందన్నారు. అధికారులు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లకు శాస్త్రీయ ప్రమాణాలపై అవగాహన పెంపొందించడమే వర్క్‌షాప్ లక్ష్యమని ఏపీ డీసీఏ డైరెక్టర్ ఎం. పాండురంగ ప్రసాద్ తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
శనివారం 08.08.2026



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# మునక్కాడ లాభాలు

వాడుక భాషలో మునక్కాడ లేదా ములక్కాడగా పిలువబడే డ్రంస్టిక్స్ ఆరోగ్యానికి విస్తృత ప్రయోజనాలను కలిగిస్తుంది. దీని వలన ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాల గురించి ఇక్కడ వివరించబడింది.



### ఇవి ఆరోగ్యకరం కావున తినండి

డ్రంస్టిక్స్, తెలుగులో "ములక్కాడ"గా పిలువబడే దీనిలో విలువైన మినరల్ మరియు ప్రోటీన్లు ఉన్నాయి. వీటిని సాధారణంగా సాంబార్, ఇతర కూరగాయలు మరియు తృణధాన్యాలలో తయారీలో వాడతారు. మంచి రుచితో పాటూ, ఆరోగ్యంగా ఉండటకు వీటిని వలన కలిగే ప్రయోజనాల గురించి తప్పక తెలుసుకోవలసిందే. వాటి గురించి ఇక్కడ తెలుపబడింది.

### బలమైన ఎముకలను నిర్మిస్తుంది

ములక్కాడలు ఉండే కాల్షియం ఐరన్, ఇతర కీలక విటమిన్ లను కలిగి ఉన్నందు వలన ఎములకు బలాన్ని చేకూరుస్తుంది. ములక్కాడ రసాన్ని లేదా పాలతో తీసుకోవటం వలన ఎముకల ఆరోగ్యం మేరుగుపడటమే కాకుండా, చిన్న పిల్లలలో ఎముకలు బలంగా మారతాయి.

### రక్తాన్ని శుభ్రపరుస్తుంది

ములక్కాడలు, రక్తాన్ని శుభ్రపరచటమే కాకుండా, బలమైన యాంటీ బయాటిక్ గుణాలను కలిగి ఉంటాయి. ఇలాంటి కూరగాలను రోజు తినటం వలన మొటిమలు మరియు ఇతర చర్మ సంబంధిత సమస్యలను తగ్గిస్తాయి.




### రక్తలోని చక్కెర స్థాయిల తగ్గింపు

ములక్కాడ ఆకులు రక్తంలోని చక్కెర స్థాయిలను తగ్గించి, మధుమేహ వ్యాధిని తగ్గిస్తాయి. ములక్కాడలను తినటం వలన సూప్ లేదా జ్యూస్ లో కలుపుకొని, తాగటం వలన పిత్తాశయం విధి సరిగా నిర్వహించేలా ప్రోత్సహించి, చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతాయి.

### గర్భసమస్యలను తగ్గిస్తుంది

గర్భ సమయంలో ములక్కాడలను తినటం వలన ప్రసవం ముందు మరియు తరువాత కలిగే సమస్యలను తగ్గిస్తుంది. అధిక స్థాయిలో విటమిన్ మరియు మినరల్ లను కలిగి ఉండే ఈ రకం కూరగాయలు గర్భాశయం యొక్క నిదానించడం వంటి సమస్యలను తగ్గించి, ప్రసవం తరువాత పాల ఉత్పత్తిని పెంచుతుంది.

### జీర్ణ వ్యవస్థలో మెరుగుదల

ములక్కాడలు మరియు వాటి ఆకులు సంక్లిష్ట విటమిన్ 'B' లను కలిగి ఉండి, జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ విటమిన్ లు జీర్ణ వ్యవస్థను నియంత్రించి, సంక్లిష్ట కార్బోహైడ్రేట్లను, ప్రోటీన్, కొవ్వును విచ్ఛిన్న పరుస్తాయి.

### లైంగిక సామర్థ్యాన్ని పెంచుతాయి

ములక్కాడలో మంచి మోతాదులో జింక్ ఉండటం వలన శుక్రకణాల (స్పెర్మాటోజెనెసిస్) ఉత్పత్తి పద్దతిని పెంచి, పురుషులలో లైంగిక శక్తిని పెంచుతుంది. ముదురు రంగులో ఉండే ఈ చెట్లలో ఉండే సమ్మేళనాలు నపుంసకత్వాన్ని, అకాల స్ఖలనం మరియు పలుచటి వీర్యం వంటి సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది.

## వణికిపోతున్న

# లష్కర్-ఎ-తోయిబా

## భారత ప్రతీకార వ్యూహంతో ఉక్కిరిబిక్కిరి

పాకిస్తాన్‌లోని ఉగ్రవాద సంస్థలు ఇప్పుడు తమను తాము రక్షించుకోవడానికి కూడా కష్టపడుతున్నాయి. లష్కర్–ఎ–తోయిబా (ఎల్ఈటీ) లాంటి సంస్థ ఒకప్పుడు భారత్‌పై దాడులకు ప్రసిద్ధి చెందింది. కానీ ఇప్పుడు ఆ సంస్థలోనే భయం వ్యాపించింది. వారి స్వంత నాయకుల మాటల్లోనే ఈ వాస్తవం బయటపడుతోంది.



### అంగీకరించిన ఆపరేషన్స్ చీఫ్..

పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో జరిగిన ఒక కీలక సమావేశంలో లష్కర్–ఎ–తోయిబా ఆపరేషన్స్ డెప్యూటీ చీఫ్ రిజ్వాన్ హనీఫ్ మాట్లాడారు. ఆ ప్రసంగం గూఢచారి వర్గాలకు అందడంతో ఇప్పుడు చర్చ జరుగుతోంది. అందులో ఆయన స్పష్టంగా చెప్పిన మాటలు ముఖ్యం. అజ్ఞాత సాయుధుల చేతిలో ఇప్పటి వరకు 30 మంది కీలక లష్కర్ నాయకులు మరణించారని ఆయన అంగీకరించారు. ఇది కేవలం వార్తల స్థాయిలో ఉన్న విషయం కాదు. సంస్థలోని సీనియర్ నాయకుడే దీన్ని ధవీకరించడం పాక్ ఉగ్రవాద వర్గాల్లో ఆందోళనకు నిదర్శనం.

### కార్యకలాపాలకు బ్రేక్..

హనీఫ్ మాటల ప్రకారం, భారత్‌లోకి చొరబాట్లు, ఉగ్రవాదుల ఎంపిక, శిక్షణ, సమన్వయం వంటి మొత్తం వ్యవస్థ దెబ్బతిన్నది. లష్కర్‌ను నిషేధించిన తర్వాత పీపుల్స్




యాంటీ ఫాసిస్ట్ ఫ్రంట్ (పీఏఎఫ్ఎఫ్) పేరుతో కార్యకలాపాలు కొనసాగించే ప్రయత్నం చేశారు. కానీ అది కూడా ఇప్పుడు సాధ్యం కావడం లేదని ఆయనే చెప్పారు. పెషావర్, రావల్పిండి, రావాలాకోట్, ముజఫరాబాద్ వంటి ప్రాంతాల్లో కూడా అజ్ఞాతుల దాడులు జరిగినట్లు పేర్కొన్నారు. ఉగ్రవాద మూలాలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ఈ చర్యల వల్ల సంస్థకు భారీ నష్టం జరుగుతోందని అంగీకరించారు.

### మారిన వ్యూహం..

మూడు–నాలుగేళ్లుగా ఉగ్రవాదులు చిన్న వ్యాపారాలు చేస్తున్నట్లు, మసీదుల్లో మౌలానాలు, ఇమామ్‌లుగా కనిపిస్తూ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. అనుకూల పరిస్థితులు వచ్చినప్పుడు మాత్రమే దాడులు చేసే వ్యూహానికి మారారు. అజ్ఞాత సాయుధుల భయంతో నాయకులు బయటకు రావడానికి కూడా సంకోచిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత మౌలానా మసూద్ అజర్ కుటుంబ సభ్యులు 14 మంది మరణించిన సంఘటన కూడా ఇక్కడ గుర్తించాలి. పరిహారం తీసుకుని ఆయన సైలెంట్‌గా ఉండటం, బయటకు రాకపోవడం – ఇవన్నీ ఒత్తిడి పెరిగిన సంకేతాలు.

### భారత్ ఎఫెక్ట్..

భారత్ ఉగ్రదాడులకు ప్రతీకారంగా పాక్ భూభాగంలోనే లక్ష్యాలను ఎంచుకుంటున్న విధానం ఈ ఫలితాలను తీసుకొచ్చింది. లష్కర్ వంటి సంస్థలు ఇప్పుడు తమ కార్యకలాపాలను సాధారణంగా కొనసాగించలేకపోతున్నాయి. నాయకులు దాగి ఉండాల్సి వస్తోంది. పాక్ ఉగ్రవాద సంస్థలు ఈ అజ్ఞాత సాయుధులను భారత ఆపరేషన్‌గా అనుమానిస్తున్నాయి. ఈ అనుమానం మరింత భయాన్ని పెంచుతోంది. ఫలితంగా వారు రక్షణాత్మక వైఖరి తీసుకుంటున్నారు.

ఒకప్పుడు భయం పుట్టించిన లష్కర్–ఎ–తోయిబా ఇప్పుడు తానే భయపడుతోంది. సొంత నాయకుల నోటినుంచి వెలువడిన ఈ మాటలు పాక్‌లోని ఉగ్రవాద నెట్‌వర్క్‌పై భారత వ్యూహం సృష్టించిన ఒత్తిడిని స్పష్టం చేస్తున్నాయి. ఉగ్రవాద మూలాలను లక్ష్యంగా చేసుకున్న చర్యలు కొనసాగుతున్నంత కాలం ఈ ఆందోళన మరింత పెరగడం అనివార్యం.

## మూడు ఉపఎన్నికలు..

# ఆరు పాఠాలు

ఇటీవల బిహార్‌లోని బాంకిపూర్, మధ్యప్రదేశ్‌లోని దతియా అసెంబ్లీ నియోజకవర్గాల ఉప ఎన్నికల్లో బీజేపీ ఘనమైన మెజారిటీతో ఓడిపోయింది. ఈ రెండు రాష్ట్రాల్లోనూ బీజేపీ అధికారంలో ఉన్నప్పటికీ ఫలితాలు ఆశించిన విధంగా రాలేదు. అదే సమయంలో గుజరాత్‌లో జరిగిన ఉప ఎన్నికలో మాత్రం పార్టీ సునాయాసంగా విజయం సాధించింది. ఈ మూడు ఫలితాలు కలిపి చూస్తే రాజకీయ పార్టీలకు కొన్ని స్పష్టమైన పాఠాలు కనిపిస్తున్నాయి.



### విపక్షాలకు కీలక సందేశాలు

★ఎన్నికల యంత్రాంగం, ఓటర్ల జాబితా, ఈవీఎంలు ఒకేలా ఉన్నా కూడా ఫలితం మారవచ్చు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ తర్వాత తయారైన ఓటర్ల జాబితాతోనే బీజేపీని ఓడించగలిగిన సందర్భం ఇది. కేవలం సాంకేతిక అంశాలపై ఆధారపడకుండా క్షేత్రస్థాయిలో పని చేస్తే ఫలితం వస్తుందని ఈ ఎన్నికలు చూపించాయి.

★బాంకిపూర్‌లో ప్రశాంత్ కిషోర్ నేరుగా ప్రజలను కలుస్తూ, ఓటరు నుంచి ఓటరు, బూత్ నుంచి బూత్, గ్రామం నుంచి గ్రామం వరకు కదిలిన వ్యూహం ఫలించింది. గతంలో ఎనిమిది సార్లు బీజేపీ గెలిచిన స్థానంలో ఈసారి మార్పు వచ్చింది. బీజేపీ సాధారణంగా 35–38 శాతం ఓట్లు పొందుతుందని, మిగతా ఓట్లను ఏకం చేస్తే విజయం సాధ్యమని ఈ ఫలితం నిరూపించింది. రాష్ట్రస్థాయి నాయకుడిగా ఉండటం కూడా అతనికి అనుకూలంగా పనిచేసింది.

★పోటీలోకి దిగే ముందే ఇతర పార్టీలతో చర్చలు జరిపి వారిని ప్రచారం నుంచి దూరంగా ఉంచడం వల్ల ఓట్లు చీలకుండా ఉండటం సాధ్యమైంది. ఆర్జేడీ కూడా నామమాత్రంగా పాల్గొనడంతో ప్రధాన అభ్యర్థికి అనుకూల పరిస్థితి ఏర్పడింది.

### బీజేపీకి మూడు గుణపాఠాలు

★బాంకిపూర్‌లో నామినేషన్ల చివరి రోజున అభ్యర్థిని మార్చడం వల్ల కొత్త వ్యక్తికి ప్రచారానికి సమయం లేకపోయింది. దతియాలో మాజీ మంత్రిని పక్కన పెట్టి కొత్తవారికి టికెట్ ఇవ్వడం వల్ల అతను రెబల్‌గా బరిలోకి దిగి నియోజకవర్గంలో అస్థిరత సృష్టించాడు. పార్టీ ఐక్యతకు చిహ్నంగా ఉన్న బీజేపీలోనే ఎన్నికలకు ముందు చీలిక ఏర్పడింది. ఎవరినైనా నిలబెట్టి గెలవవచ్చనే భావన ప్రమాదకరమని ఇది చూపించింది.

★పెద్ద నాయకులు గణనీయంగా రంగంలోకి దిగకపోవడం, స్థానిక సమస్యలపై దృష్టి సారించకపోవడం ఓటమికి దోహదం చేశాయి.

★ఎన్నికల ప్రచారం జరుగుతున్న సమయంలో 25 రోజులు ఢిల్లీలో కాక్రోచ్ జనతాపార్టీ నిరసన తెలిపింది. కానీ ఈ ప్రభావం ఎన్నికలపై పడలేదు. అక్కడి ప్రజలు స్థానిక సమస్యలు అడిగారు. అభిజిత్ దీప్కే గురించి దహియా గురించి అడగలేదు.

★గుజరాత్‌లో ఎన్నికలకు సిద్ధంగా ఉన్న పరిస్థితుల్లో బీజేపీ ఘన విజయం సాధించి కాంగ్రెస్‌ను ఓడించింది. అయితే బిహార్, మధ్యప్రదేశ్ ఉప ఎన్నికలను తేలికగా తీసుకోవడం వల్ల నష్టపోయింది. భవిష్యత్తులో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, ప్రతీ ఉప ఎన్నికను కూడా పూర్తి స్థాయి పోరాటంగా చూడాలని ఈ ఫలితాలు హెచ్చరిస్తున్నాయి.

ఈ మూడు ఉప ఎన్నికలు ఒకే సందేశాన్ని ఇస్తున్నాయి. రాజకీయ విజయం కేవలం అధికారం లేదా గత రికార్డులపై ఆధారపడదు. క్షేత్రస్థాయి పని, సరైన అభ్యర్థి ఎంపిక, పార్టీ అంతర్గత ఐక్యత, స్థానిక సమస్యలపై దృష్టి ఇవన్నీ కలిసి నిర్ణయించేవి. విపక్షాలు ఈ పాఠాలను స్వీకరిస్తే భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు వచ్చే అవకాశం ఉంది. బీజేపీ ఈ ఓటములను గుణపాఠంగా తీసుకుని అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలను మెరుగుపరచుకుంటే తన పటిష్టతను కాపాడుకోగలదు. ఉప ఎన్నికలు చిన్నవి అయినా, అవి పెద్ద పాఠాలను నేర్పుతాయి.

# చాణుక్యుడు చెప్పిన నీతి కథ

ఒక అడవిలో ఒక లేడి భారంగా అడుగులు వేస్తూ వెడుతోంది. అది నిండు గర్భిణి. దానికి అప్పుడే నొప్పులు వస్తున్నాయి. అది అనుకూలమైన ప్రదేశం కోసం వెతుకుతోంది. ఒక దట్టమైన గడ్డి భూమి కనబడింది. దానికి అటుపక్క నది ప్రవహిస్తోంది. అదే అనుకూలమైన ప్రదేశం అనుకుంది. నొప్పులు మొదలయ్యాయి. నిట్టూర్పులు విడుస్తూ అటూ ఇటూ తిరుగుతోంది.. అప్పుడే దట్టమైన మబ్బులు కమ్మాయి. ఉరుములు, పిడుగులు. పిడుగు పడి కొద్ది దూరంలోనే గడ్డి అంటుకుంది. దూరంగా తన ఉనికిని గమనించి కుడి వైపు నుండి ఒక సింహం వస్తోంది. ఎడమవైపు నుంచి ఒక వేటగాడు బాణం సరి చూసుకుంటున్నాడు. ఇంకో వైపు నది వెళ్ళనివ్వదు!

భగవాన్! ఆ లేడి ఇప్పుడు ఏమి చెయ్యాలి ?

ఏమి జరగబోతోంది?

లేడి బిడ్డకు జన్మ ఇస్తుందా? బిడ్డ బతుకుతుందా?

సింహం లేడిని తినేస్తుందా?

వేటగాడు లేడిని చంపెస్తాడా?

నిప్పు లేడి వరకూ వచ్చి లేడి కూనను చంపేస్తుందా?

ఒక వైపు నిప్పు, రెండో వైపు నది, మిగిలిన రెండు వైపులా మృత్యువు రూపం లో వేటగాడు, సింహం. కానీ లేడి మాత్రం ఇవేవీ పట్టించుకోలేదు.

అది తన బిడ్డను కనడం మీదే దృష్టి పెట్టింది.. అప్పుడు పరిణామాలు ఇలా జరిగాయి.. పిడుగు కాంతికి వేటగాడి కళ్ళు చెదిరాయి. గురి తప్పి బాణం సింహానికి తగిలింది. వర్షం పడి సమీపిస్తున్న మంటలు ఆరిపోయాయి. లేడి పిల్ల తల్లి గర్భంలో నుండిబయటకు వచ్చింది. అది ఆరోగ్యంగా ఉంది. ఏదైతే జరగనీ, నేను బిడ్డకు జన్మనివ్వడం మీదనే దృష్టి పెడతాను అని అదిఅనుకోకుండా ప్రాణం గురించి ఆలోచించి తప్పటడుగు వేసి ఉండి వుంటే.. ఏమి జరిగేది????.. మన



జీవితాలలో కూడా అన్ని వైపులా సమస్యలు చుట్టూ ముడుతూనే ఉంటాయి . నెగటివ్ ఆలోచనలతో సతమవుతూనే ఉంటాము. మన తక్షణ కర్తవ్యాన్ని విస్మరిస్తాము. భగవంతుడిపై భారం వేసి మన పని మనం చెయ్యడమే మనం చెయ్యవలసినది:)




## రాత్రి 7 తరువాత

# చేయకూడనివి!!

పొద్దున లేచిన దగ్గరనుండి రాత్రి ఇంటికి చేరుకునే వరకు తీరిక లేకుండా ఎంతో కష్టపడి అలసిపోయి ఇంటికి వస్తారు. ఇలా చేయడం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని అందరికి తెలిసిన విషయమే.. కాని తప్పక కాలాన్ని అలా గడిపేస్తుంటారు. కాని రాత్రి 7 తరువాత చేయకూడని పనులు కొన్ని ఉన్నాయి. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం..!!

చాలామంది ఆఫీసు నుంచి ఇంటికి రాగానే ఏం చేస్తారు? డ్రస్ కూడా మార్చకుండా ఆదరాబాదరాగా ఏదో ఒకటి తింటుంటారు. ఇది మంచిది కాదు. సాయంత్రం తీసుకునే స్నాక్స్ కేవలం మానసికానందం కోసం తప్ప.. ఆకలి తీర్చుకోవాడానికి కాదట..! అందుకే ఇంటికి వచ్చిన వెంటనే ఫ్రెష్ అయిన తరువాత తక్కువ స్థాయిలో ఆహారం తీసుకుంటే ఆహ్లాదంగా ఉంటుందట.

ఇక సాయంత్రం తాగే టీతో పాటు చాలామంది భారీగా స్నాక్స్ లాగించేస్తుంటారు. అందులో ముఖ్యంగా ఉండేది జంక్ ఫుడ్. మరి కొద్ది సెపట్లో రాత్రి భోజనం చేసే ముందు ఇటువంటి జంక్ ఫుడ్ తీసుకొవడం అనారొగ్యానికి దారి తీస్తుంది.

చాలా మంది సాయంత్రం సమయం నుంచి మంచి నీళ్ళు తక్కువగా తీసుకుంటుంటారు. పగటి సమయంలాగే రాత్రి వేళల్లో కూడా తగిన మోతాదులో నీళ్ళు తీసుకోవాలి.

ఇక పగలంతా అలిసిపోయి ఇంటికి వచ్చినవారు గంటల తరబడి టివి చూస్తుంటారు. ఇది మంచి పద్ధతి కాదు. టీవీ చూడొచ్చు గాని అదే పనిగా కాకుండా ఒక గంట చూస్తే సరిపోతుందని నిపుణులు అంటున్నారు. ఆ మిగతా సమయాన్ని కుటుంబ సభ్యులతో గడపడం, పుస్తకాలు చదవడం వంటివి చేస్తే మంచిదని అంటున్నారు.

చాలా మంది రాత్రి భోజనాన్ని భారీగా తీసుకుంటుంటారు. నిజానికి రోజు మొత్తం చేసే భోజనంలో బ్రేక్ ఫాస్ట్ కీలకం. రాత్రి భోజనానికి అంత ప్రాధాన్యత లేదు. అమితంగా ఆహారం తీసుకుంటే సరిపోతుంది. అది కూడా తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. అలాగే భోజనం చెసిన వెంటనే నిద్రించడం మంచి పద్ధతి కాదు అంటున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 08.08.2026
www.mudranews.in | @mudranews



**చిన్న చిన్న విషయాలు మర్చిపోతున్నారా?**

నిద్ర కూడా ముఖ్యం రోజుకు 7–8 గంటల నాణ్యమైన నిద్ర లేకపోతే జ్ఞాపకశక్తి బలహీనపడుతుంది. సరైన నిద్ర అలవాటు చేసుకోండి.



# చేనేత సంస్కృతి మన దేశానికి జీవకర్ర

**మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ**

**ముద్ర, హైదరాబాద్ :** జాతీయ చేనేత దినోత్సవాన్ని (ఆగస్టు 7) పురస్కరించుకుని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఆయన తనయ విజయలక్ష్మి నేతృత్వంలోని 'అలాయ్ బలాయ్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో ప్రత్యేక వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత రంగానికి, సమాజానికి విశేష సేవలు అందించిన పలువురు పద్మశాలి ప్రముఖులను ఫౌండేషన్ ప్రతినిధులు శాలువాలతో సత్కరించి, ప్రశంసాపత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.అందులో భాగంగా తెలంగాణ ఆన్ లైన్ మీడియా వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) నేషనల్ కౌన్సిల్ ఫార్మర్ మెంబర్,ఢీంబాయ్ టీవీ న్యూస్ ఛానల్ సీఈవో వేముల సదానందం నేత కు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎల్. రమణ, రాజ్యసభ మాజీ సభ్యులు రాపోలు ఆనంద భాస్కర్, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు ,బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేష్ తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలకు చేనేత రంగుల అద్దకం జీవకర్ర అని కొనియాడారు. రాత్రింబవళ్లు శ్రమించి నేత కార్మికులు తయారుచేసే వస్త్రాలు దేశీయ ప్రతిభకు నిదర్శనమని అన్నారు. చేనేత వృత్తిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందంటూ, చేనేత కార్మికుల సంక్షేమానికి తమ ఫౌండేషన్ ఎల్లప్పుడూ తోడ్పాటునందిస్తుందని పేర్కొన్నారు.అలాయ్ బలాయ్ ఫౌండేషన్ నిర్వాహకురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ, చేనేత రంగాన్ని ప్రోత్సహించడం మరియు ఆయా రంగాల్లో గుర్తింపు పొందిన పద్మశాలి ప్రముఖులను గౌరవించుకోవడం తమ ఫౌండేషన్‌కు ఎంతో గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అలాయ్ బలాయ్ ఫౌండేషన్ సభ్యులు, పద్మశాలి సంక్షేమ సంఘాల నాయకులు మరియు చేనేత ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బోనాలు పూర్తయ్యే వరకు అధికారులు అందుబాటులో ఉండాలి

**ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్:** బోనాల ఉత్సవాలు ముగిసే వరకు అన్ని శాఖల అధికారులు సిబ్బంది స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్ అన్నారు. దేవాలయాల వద్ద, బస్తీలలో బోనాల సందర్భంగా సమస్యలు ఉన్నాయని స్థానికులు రెండు రోజుల క్రితం చెప్పగా అధికారులను పిలిపించి ఎమ్మెల్యే పనులు పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఇందులో భాగంగా శుక్రవారం మరోసారి బుజిలీ మహంకాళి చైర్మన్ భోగి బాల్ రాజ్ , స్థానికులతో పాటు అధికా రులను ఎమ్మెల్యే కౌసర్ పిలిపించారు. ఆలయాల వద్ద చేసిన ఏర్పాట్ల కోసం అడిగి తెలుసుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయకపోవడం, బోనాల సందర్భంగా ట్రాఫిక్ సమస్యల విషయాలను బాలరాజ్, పరమేష్ లో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్ మాట్లాడుతూ.... శనివారం మధ్యాహ్నం వరకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలన్నారు. రంగం అనంతరం తొట్టెల నిమజ్జనం పూర్తయ్యే వరకు మూడు రోజులు అధికారులు స్థానికులకు అందుబాటులో ఉండి సమస్య వచ్చినప్పుడు వెంటనే స్పందించాలని సూచించారు. ముగిసిన ఘటం ఊరేగింపు...తెలంగాణ బోనాల సందర్భంగా మొదటి ఊరేగింపు పూజ నిర్వహించే లంగర్ హౌస్ బుజిలి మహంకాళి ఆలయంలో ఘటం ఊరేగింపు శుక్రవారం ముగిసింది. గత పది రోజులుగా అమ్మవారిని వాడవాడనా, వీధి వీధినా, ఇంటింటికి ఊరేగింపుగా తిప్పారు. ఈ సందర్భంగా భక్తులు ఒడిబియాలు సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు.





## త్వరలో రూ.25 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం

**ముద్ర ప్రతినిధి,తాండూరు:** వికారాబాద్ జిల్లాతాండూరు మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలు సుకున్నారు. స్థానిక కౌన్సిలర్, మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి వార్డులో పర్యటించి అభివృద్ధి పనులపై సమీ క్షించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ 8వ వార్డును దశలవారీగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. త్వరలోనే రూ.25 లక్షల నిధులతో సీసీ రోడ్డు తదితర అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామని పేర్కొన్నారు. వార్డులో చేపట్టాల్సిన మిగిలిన అభివృద్ధి పనుల వివరాలను తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, ఆయన సహకారంతో పనులను వేగవంతంగా పూర్తి చేస్తామని అన్నారు. రాజీవ్, ఇందిరమ్మ కాలనీలను కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో నిర్మించారని, ఆయా కాలనీల అభివృద్ధికి కూడా ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.ఈ పర్యటనలో 8వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ కమిషనర్, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు.



**బోనాల పండుగలో..**

ఇందిరమ్మ కాలనీలో బోనాల జాతర భవాని మాత దేవాలయ కమిటీ అధ్యక్షులు మున్సిపల్ చైర్మన్ కు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.అనంతరం భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భవాని మాత ఆలయ అధ్యక్షులు ఎలమంద, దంపతులు, రాజు కాలనీ ఇందిరమ్మ కాలనీ ఆడపడుచులు, భక్తులు తదితరులు పాల్గొనీ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అంగరంగ వైభవంగా పోచమ్మ తల్లి కళ్యాణం





**ముద్ర, కూకట్‌పల్లి :** ఆసియాలోనే అతిపెద్ద కాలనీగా పేరొందిన కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు లోని జేఎన్‌టీయూ రోడ్డులో గల పోచమ్మ తల్లి ఆలయం వద్ద శుక్రవారం అమ్మవారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆషాఢ మాసం సందర్భంగా దశపతి మహారాజు, పోచమ్మ తల్లిల వివాహ మహోత్సవాన్ని ఒగ్గు పూజారులు వారి సాంప్రదాయం ప్రకారం శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఈ కళ్యాణ మహోత్సవంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బి.ఎస్.ఎన్. రాజు (సత్తిబాబు)తో పాటు కమిటీ సభ్యులు నూతి రాంబాబు నాయుడు, ఊచా రాంబాబు, అనిల్ యాదవ్, నాగిరెడ్డి, సుబ్బారావు, జే.ఎల్. రావు, బద్రి, ప్రసాద్‌లు తమ దంపతులతో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అమ్మవారి కళ్యాణాన్ని తిల కించేందుకు అశేష సంఖ్యలో భక్తజనం తరలివచ్చారు. భక్తుల జయజయధ్వా నాలతో ఆలయ పరిసర ప్రాంతాలు ఆధ్యాత్మిక శోభతో విలసిల్లాయి. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తరించారు.

# ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

**ముద్ర. మల్కాజిగిరి :** మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో వినాయకనగర్ అంబేడ్కర్ భవనంలో "సహచరి" అవగాహన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఈఓడబ్ల్యూ ఏసీపీ సత్తయ్య ముఖ్య అతిథిగా హాజరై పాల్గొన్న వారికి పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మహిళలు, ప్రజల భద్రత కోసం అమలు చేస్తున్న "మీ సురక్ష" కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. అలాగే సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ఆన్‌లైన్ మోసాల నుంచి ఎలా అప్రమత్తంగా ఉండాలి, వ్యక్తిగత సమాచారం, ఓటీపీలు, బ్యాంకు వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసుల సహాయం పొందేందుకు డయల్ 112 సేవలను ఎలా వినియోగించుకోవాలో వివరించారు. అదేవిధంగా పోలీస్ స్టేషన్ విధులు, ప్రజలకు అందించే సేవలు, సమాజంలో "సహచరి" సభ్యులు నిర్వహించాల్సిన బాధ్యతలపై కూడా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మొత్తం 68 మంది సహచరి సభ్యులు, ఈఓడబ్ల్యూ ఏసీపీ సత్తయ్య, నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. ప్రజల్లో భద్రతా అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు మరింత ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు.



**మంజీరా ట్రినిటీ కాంప్లెక్స్‌లో**

**ముద్ర, కూకట్‌పల్లి:** నగరంలో పెరుగుతున్న సైబర్ మోసాల పట్ల ప్రజలను, ఉద్యోగులను చైతన్యపరిచేందుకు కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలోని మెంజీరా ట్రినిటీ కామర్షియల్ కాంప్లెక్స్‌లో శుక్రవారం సైబర్ నేరాల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు ఐటీ కంపెనీలు, శిక్షణ సంస్థలు ఉన్న ఈ కాంప్లెక్స్‌లో కేపీహెచ్‌బీ ఎస్‌హెచ్‌ఓ, డీఐ మరియు సైబర్ వారియర్ టీమ్ ఆధ్వర్యంలో ఈ సదస్సు జరిగింది.ఈ సందర్భంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, విద్యార్థులు మరియు సాధారణ ప్రజలకు సైబర్ నేరగాళ్లు అవలంబిస్తున్న రకరకాల మోసపూరిత పద్ధతులపై పోలీసు అధికారులు సమగ్రంగా వివరించారు. ముఖ్యంగా సెక్స్‌టార్షన్, పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరిట మోసాలు, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్, డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు, ఫిషింగ్, యూపీఐ/బ్యాంకింగ్ ఫ్రాడ్స్ మరియు సోషల్ మీడియా మోసాల పట్ల తీవ్ర అప్రమత్తత అవసరమని అధికారులు స్పష్టం చేశారు.ఒకవేళ ఎవరైనా సైబర్ నేరగాళ్ల బారినపడి ఆర్థికంగా నష్టపోతే, ఆలస్యం చేయకుండా వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ లో నమోదు చేయాలని పిలుపునిచ్చారు. మోసం జరిగిన వెంటనే బాధితులు స్పందిస్తే బాధితుల డబ్బును హోల్డ్‌లో పెట్టి రక్షించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సదస్సు చివర్లో నిర్వహించిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో పాల్గొన్నవారు తమ అనుమానాలను నివృత్తి చేసుకున్నారు. సైబర్ భద్రతపై ముందస్తుగా ఈ అవగాహన సదస్సును ఏర్పాటు చేసిన కేపీహెచ్‌బీ పోలీసులను కాంప్లెక్స్ సభ్యులు, ఉద్యోగులు అభినం దించారు.

## పోగొట్టుకున్న 17 మొబైల్ ఫోన్ల అందజేత

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ సందర్భాల్లో పోగొట్టుకున్న, దొంగతనానికి గురైన 17 మొబైల్ ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో పోలీసులు విజయవంతంగా రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు ఇన్స్పెక్టర్ కరుణాకర్ తెలిపారు. వన్ టౌన్ సిబ్బంది, ఐటి కోర్ టీం సమన్వయంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుండి ఈ ఫోన్లను ట్రేస్ చేసి స్వాధీనం చేసుకున్నారని,రికవరీ చేసిన ఫోన్లను బాధితులకు స్వయంగా అందజేశామని తెలిపారు. తమ ఫోన్లను తిరిగి పొందిన బాధితులు పోలీసు యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీ పద్మావతి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : స్వర్ణగిరి దివ్య దేవస్థానంలో శుక్రవారం శ్రీ పద్మావతి అమ్మవారి కి సహస్ర కుంకుమార్చన సేవ అర్చక స్వాములు నిర్వహించారు.**



## రూ.1.17 కోట్లతో రోడ్లు, యూజీడీ పనులకు శంకుస్థాపన



**ముద్ర ప్రతినిధి, హైదరాబాద్:** హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్, రామ్‌నరేష్‌నగర్, గౌతమినగర్, హెచ్ఎంటీ శాతవాహననగర్ కాలనీల్లో రూ.1.17 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, యూజీడీ పనులకు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. తాజా మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.నాగార్జున హోమ్స్ ప్రాంతంలో 60 అడుగుల రహదారి ఉండగా, కొన్ని నిర్మాణాలకు 100 అడుగుల రహదారిని చూపిస్తూ అనుమతులు ఇవ్వడంపై గాంధీ అభ్యంతరం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే పోరాడుతామని స్పష్టం చేశారు.

## వెంకట ప్రణీత్ డెవలపర్స్ అనుమతులు రద్దు చేయాలి



**ముద్ర, శేరిలింగంపల్లి:** ఆదిత్య నగర్‌లో వెంకట ప్రణీత్ డెవలపర్స్ నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనాలకు ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ డిమాండ్ చేశారు. అందరికీ 60 అడుగుల రహదారిని చూపించి అనుమతులు ఇచ్చి, సదరు డెవలపర్స్‌కు మాత్రం 100 అడుగుల రహదారిగా చూపించి అనుమతులు ఇవ్వడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.100 అడుగుల రహదారి లేని చోట అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించిన గాంధీ, ఎనిమిది మీటర్ల నాలా, బఫర్‌జోన్ ఆక్రమణలపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. 60 అడుగుల రహదారికి అనుగుణంగా అనుమతులు పరిమితం చేసి, అదనపు అంతస్తుల అనుమ తులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనుమతులు రద్దు చేసే వరకు కాలనీ వాసుల తరఫున పోరాడతానని హామీ ఇచ్చారు.ఇదిలా ఉండగా హైదర్‌నగర్ డివిజన్‌లో రూ.1.17 కోట్లతో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు గాంధీ శంకుస్థాపన చేశారు. ఆదిత్యనగర్, రామ్‌నగర్, గౌతమినగర్, శాతవాహననగర్ కాలనీల్లో ఈ పనులు చేపట్టనున్నారు. కాగా, బిల్డర్‌కు అనుమతులు ఇచ్చిన అధికా రులపై అధికార పార్టీకి చెందిన పీఏసీ చైర్మన్ విమర్శలు చేయడం చర్చనీయాంశంగా మారింది.

## చర్లపల్లి చెరువు సుందరీకరణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**ముద్ర, కాప్రా:** చర్లపల్లి చెరువులో కొనసాగుతున్న అభివృద్ధి, సుందరీకరణ పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరిశీ లించారు.ఈ సందర్భంగా చెరువు పరిసరాల్లో జరుగుతున్న పనుల నాణ్యత, పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడంతో పాటు, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని అధికారులకు సూచించారు.చెరువును ప్రజలకు ఆహ్లాదకరమైన విహార కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని, పచ్చదనం పెంపు, వాకింగ్ ట్రాక్, లైటింగ్, పరిశుభ్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా చెరువుల పరిరక్షణ, సుంద రీకరణకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. చర్లపల్లి చెరువు అభివృద్ధి పూర్తయితే స్థానిక ప్రజలకు మెరుగైన వాతావరణం, వినోద సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## గువ్వల బాలరాజు అరెస్టును ఖండించిన ఎంపీ ఈటల రాజేందర్



**ముద్ర, మల్కాజ్‌గిరి:** మల్కాజ్గిరి ముద్ర బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అరెస్టును మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ తీవ్రంగా ఖండించారు. పండుగ సాయన్న విగ్రహం తొలగింపును నిరసిస్తూ వెళ్తున్న బాలరాజును కల్వకుర్తి వద్ద అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు. వెంటనే ఆయనను విడుదల చేయాలని, పండుగ సాయన్న విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## కేపీహెచ్‌బీలో ఫోన్ దొంగ అరెస్ట్

**రూ.80 వేల విలువైన ఐఫోన్ రికవరీ**



**ముద్ర, కూకట్పల్లి :** కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా మొబైల్ ఫోన్ల దొంగతనాలకు పాల్పడుతున్న ఒక పాత నేరస్థుడిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి సుమారు ₹80,000 విలువైన ఆపిల్ ఐఫోన్ 16 ప్లస్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని కేపీహెచ్‌బీ రద్దీగా ఉండే షాపింగ్ ప్రాంతంలో ఓ వ్యక్తికి చెందిన ఐఫోన్ చోరీకి గురైంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, లూలూ మాల్ సమీపంలో లభించిన పక్కా సమాచారంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరాన్ని అంగీకరించడంతో అతని వద్ద నుంచి చోరీకి గురైన ఐఫోన్‌ను పంచుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు.అరెస్టయిన నిందితుడిని సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రి సమీపంలో ఫుట్‌పాత్‌పై నివాసముండే వెంకట రమణ (40)గా పోలీసులు గుర్తించారు. ఇతను గతంలో పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా ఇలాంటి మొబైల్ చోరీ కేసే నమోదైన పాత నేరస్థుడని అధికారులు తెలిపారు.షాపింగ్ మాల్స్, బస్ స్టాండ్లు, మెట్రో స్టేషన్లు వంటి రద్దీ ప్రదేశాల్లో ప్రజలు తమ ఫోన్లు, ఇతర విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కేపీహెచ్‌బీ పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఫోన్ పోయినా లేదా చోరీకి గురైనా వెంటనే సిఈఐఆర్ పోర్టల్‌లో ఐఎంఈఐ నంబర్‌ను బ్లాక్ చేయాలని, పోలీసులకు లేదా 112కు సమాచారం అందించాలని సూచించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 08.08.2026
www.mudranews.in | @mudranews



## చిన్న చిన్న విషయాలు మర్చిపోతున్నారా?

. వైద్యుడిని సంప్రదించండి
మర్చిపోవడం తరచూ జరుగుతుంటే స్వయంగా మందులు వాడకుండా వైద్యుడిని సంప్రదించి అవసరమైన విటమిన్ పరీక్షలు చేయించుకోవడం మంచిది.



# ప్రత్యామ్నాయ పంటల సాగుతోనే రైతులకు భరోసా: మంత్రుల సూచన



**ముద్ర, కరీంనగర్ :** వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు అధిక నీటి అవసరమున్న వరి సాగును మరింత విస్తరించకుండా, ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో కలిసి ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

ఆగస్టు 15 నుంచి రాష్ట్రంలోని 1.05 కోట్ల కుటుంబాలకు తెలంగాణ స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే 16 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని, నీటి లభ్యతను బట్టి సాగు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

అదే సమయంలో మండల ప్రజావాణిని ప్రతి వారం నిర్వహించడం, వనమహోత్సవం లక్ష్యాలు పూర్తి చేయడం, చేయూత పెన్షన్లు, పాఠశాల యూనిఫాం కుట్టు పనులను గడువులోగా పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగానికి సూచించారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని పంటల వైవిధ్యీకరణ కార్యక్రమాలను వేగవంతం చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో జువ్వాడి ప్రత్యేక పూజలు



**ముద్ర, కోరుట్ల;** ఆషాడ మాస బోనాల సందర్భంగా మెట్‌పల్లి పట్టణంలోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు దర్శించుకుని అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రత్యేక పూజల్లో పాల్గొని కోరుట్ల నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు రైసుద్దీన్, కో-ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ పై చర్యలకు బీజేపీ డిమాండ్

**ఎస్పీ కి వినతిపత్రం**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీని లక్ష్యంగా చేసుకుని అసభ్యకర, రెచ్చగొట్టే పోస్టర్లు వేసి ప్రజా ఆస్తులను ధ్వంసం చేసిన యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా యువ మోర్చా నిర్మల్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు బిజేవైఎం జిల్లా అధ్యక్షుడు దొడ్డికింది నిరంజన్ రెడ్డి నేతృత్వంలో ప్రతినిధి బృందం జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు లేఖను చేశారు. ప్రజా ఆస్తుల విరూపణ నిరోధక చట్టం, భారతీయ న్యాయ సంహిత సెక్షన్ల కింద బాధ్యులైన యూత్ కాంగ్రెస్ నాయకులపై తక్షణమే కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో కోరారు.

# చేనేత వస్త్రాలను ధరించి నేతన్నలను ప్రోత్సహిద్దాం

**కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం**
**మేయర్ కోలగాని శ్రీనివాస్, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే**




**ముద్ర, కరీంనగర్ :** మన సంప్రదాయానికి ప్రతీక అయిన చేనేత వస్త్రాలను ధరించి నేతన్నలను ప్రోత్సహిద్దామని కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని వారికి సంక్షేమ పథకాలు అందించి అన్ని విధాలుగా అండగా నిలుస్తామని పేర్కొన్నారు.

అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులు చేనేత వస్త్రాలు ధరించేలా తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పచ్చనూరు చేనేత క్లస్టర్ తయారు చేసిన చీరను ఆవిష్కరించారు. ఆడిటోరియం వద్ద టెస్కో కరీంనగర్ డివిజన్ ఆధ్వర్యంలో చేనేత వస్త్రాలతో కూడిన ప్రత్యేక స్టాల్ ను ఏర్పాటు చేశారు.అనంతరం చేనేత ప్రతిజ్ఞ చేశారు.అంతకుముందు గీతా భావం చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు చేనేత సహకార సంఘాల అధ్యక్షులు పాలకవర్గ సభ్యులు, కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.ఈ సమావేశంలో చేనేత జౌళి శాఖ ఏడీ రాఘవరావు, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు మెతుకు సత్యం, మాజీ మేయర్ రవీందర్ సింగ్, కార్పొరేటర్ వాసాల రమేష్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# చొప్పదండి రైతాంగానికి మరో శుభవార్త..!

**ఫలించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృషి**
**నారాయణపూర్ చెరువు అభివృద్ధికి రూ.20 కోట్లు విడుదల**
**భూసేకరణ కోసం మరో ముందడుగు..**
**బండ్ విస్తరణకు ప్రభుత్వ ఆమోదం**



**ముద్ర, కరీంనగర్ :** చొప్పదండి నియోజకవర్గ రైతాంగానికి తెలంగాణ ప్రభుత్వం మరో శుభవార్త అందించింది. శ్రీపాద ఎల్లంపల్లి (ఎస్‌వైపీ) ప్రాజెక్టు పరిధిలోని నారాయణపూర్ చెరువు అభివృద్ధి, బండ్ విస్తరణకు అవసరమైన భూసేకరణ కోసం ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులను విడుదల చేసింది. దీంతో బండ్ విస్తరణ, గ్రావిటీ కాలువ నిర్మాణం, చెరువుల ఆధునికీకరణ పనులు వేగవంతం కానున్నాయి. ఈ ప్రాజెక్టు ద్వారా గంగాధర, బోయిన్‌పల్లి, కొడిమ్యాల, మల్యాల మండలాల రైతులకు సాగునీటి ప్రయోజనం కలగనుంది. నారాయణపూర్ చెరువు కింద 49,500 ఎకరాలు, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా మరో లక్ష ఎకరాలకు సాగునీటి సౌకర్యం మెరుగుపడే అవకాశం ఉంది. భూగర్భ జలాలు పెరగడంతో పాటు రెండో పంట సాగుకు కూడా అనుకూల పరిస్థితులు ఏర్పడనున్నాయి. ఈ నిధుల విడుదల ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృషి ఫలితమని స్థానికులు పేర్కొంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో ఈ ప్రాజెక్టు వేగంగా పూర్తై రైతులకు శాశ్వత సాగునీటి భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు.

# కరెన్సీ నోట్లపై భారతరత్న అంబేద్కర్ చిత్రాన్ని ముద్రించాలి



**ముద్ర, కరీంనగర్ :** మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కరెన్సీ నోట్లపై భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రాన్ని ముద్రించాలని కేంద్ర ప్రభుత్వం, భారతీయ రిజర్వ్ బ్యాంకును కోరారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రివర్గం దృష్టికి తీసుకెళ్లి రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్రానికి అధికారికంగా విజ్ఞప్తి చేసేలా కృషి చేస్తానని తెలిపారు.

న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన మంత్రి, అనంతరం జంతర్‌మంతర్‌లో కరెన్సీపై అంబేద్కర్ ఫోటో సాధన సమితి (CAPSS) నిర్వహిస్తున్న ధర్నాకు సంఘీభావం ప్రకటించారు. రాజ్యాంగ నిర్మాతగానే కాకుండా ప్రముఖ ఆర్థికవేత్తగా కూడా అంబేద్కర్ దేశానికి విశిష్ట సేవలు అందించారని, ఆయన రచనలు భారత ద్రవ్య విధానంపై కీలక ప్రభావం చూపాయని పేర్కొన్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రతీకగా నిలిచే కరెన్సీ నోట్లపై అంబేద్కర్ చిత్రాన్ని ముద్రించడం ద్వారా రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయం, సమానత్వం పట్ల భారతదేశ నిబద్ధత మరింత బలంగా ప్రతిబింబిస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు. అలాగే CAPSS ఆధ్వర్యంలో శాంతియుతంగా కొనసాగుతున్న ఉద్యమాన్ని అభినందిస్తూ, "కోలాటంతో ఢిల్లీపై కొట్లాట" పేరుతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాశీం, CAPSS జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జరిపోతుల పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

**చేనేత కార్మికుల కళానైపుణ్యం అమోఘం**
**బిజెపి జిల్లా అధ్యక్షులు మల్లేశం, మేయర్ కొలగాని శ్రీనివాస్...**

**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ 39వ డివిజన్‌లోని చేనేత సహకార సంఘం కార్యాలయం వద్ద భారతీయ జనతా పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు చేనేత మగ్గంపై నేయడం ద్వారా కార్మికుల కళానైపుణ్యాన్ని అభినందించారు. ప్రధాని నరేంద్ర మోదీ చేనేత ఉత్పత్తులకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడానికి కృషి చేశారని, అందులో భాగంగానే ఆగస్టు 7ను జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించారని పేర్కొన్నారు. అనంతరం చేనేత సంఘం అధ్యక్షులు, డైరెక్టర్లు, సభ్యులను సన్మానించి, చేనేత కార్మికులకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వాసాల రమేష్, వేముల చంద్ర శేఖర్ తెళ్ళ రమేష్, చొప్పరి జయశ్రీ, మాసం గణేష్, సరస్వతి సత్యం, గుంజెటి మెతుకు సత్యం, శివన్న, అడిచర్ల రాజు, సతీష్, మునిందర్ లతో పాటు చేనేత సంఘ సభ్యులు / డైరెక్టర్లు బోగా భద్రయ్య, చంద్రయ్య, గుర్రం ఆంజనేయులు, శ్రీపతి వెంకటేశం, తుమ్మ రామస్వామి, ఆరకాల కనకయ్య. భారీ సంఖ్యలో మహిళలు, చేనేత సంఘ సభ్యులు , స్థానికులు పాల్గొన్నారు.




## అల్ఫోర్స్ S6 క్యాంపస్‌లో ఘనంగా "మాన్సూన్ మస్తీ"



**ముద్ర, కరీంనగర్:** స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్ నెక్స్ట్ (S6 క్యాంపస్)లో "అల్ఫోర్స్ మాన్సూన్ మస్తీ" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, వినోదాత్మక విద్య విద్యార్థుల్లో నేర్చుకోవాలనే ఆసక్తిని పెంచి, విషయాలను సులభంగా గుర్తుంచుకునేలా చేస్తుందని తెలిపారు. వర్షపు చినుకుల మధ్య పాటలు, నృత్యాలు, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రకృతితో మమేకమవుతూ నిర్వహించిన ఈ వేడుక విద్యార్థులకు మరపురాని అనుభూతిని అందించిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ వారు కరువు రావాలని కోరుకుంటున్నారు

**రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్....**
**వరద కాల్వను బొందల గడ్డ అన్నవారే నేడు జీవనది అంటున్నారు....**



**ముద్ర, కోరుట్ల;** ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరడంతో ఈ ప్రాంత రైతులకు సాగునీటి ఇబ్బందులు తీరే అవకాశం ఏర్పడిందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కథలపూర్ మండలం దుంపేట గ్రామంలో వరద కాల్వ వద్ద గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా సాగు, తాగునీటి అవసరాలను తీర్చేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కడెం పరివాహక ప్రాంతం నుంచి భారీగా వరద ప్రవాహం రావడంతో ఎల్లంపల్లి ప్రాజెక్టు నిండిందని ఆది శ్రీనివాస్ తెలిపారు. భారీ వరదల కారణంగా ప్రాజెక్టు గేట్లను ఎత్తాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎల్లంపల్లి జలాలు అందుబాటులోకి రావడంతో వరద కాలువకు కూడా నీటిని విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కరువును రాజకీయ కోణంలో చూడొద్దనీ, వరద కాలువకు నీరు వస్తుండటంపై కొందరు రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. ప్రస్తుతం వస్తున్న నీరు ఎల్లంపల్లి ప్రాజెక్టు నీరు అని, కాళేశ్వరం నుంచి వచ్చిన నీరు కాదని స్పష్టం చేశారు. వరద కాలువ నిండుగా ప్రవహిస్తుండటంతో రైతులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు, బ్యారేజీలు నిండాలని ఆకాంక్షిస్తూ గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు విప్ పేర్కొన్నారు. విప్ వెంట మండలాధ్యక్షులు కాయితీ నాగరాజు, మార్కెట్ చైర్మన్ పుంద్ర నారాయణ రెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు, రైతులు ఉన్నారు.

## స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

**ఇందిరమ్మ మైనారిటీ మహిళా–యువజన పథకం కింద లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన జువ్వాడి.....**



**ముద్ర, కోరుట్ల;** మెట్‌పల్లి పట్టణంలో ఇందిరమ్మ మైనారిటీ మహిళా–యువజన పథకం కింద కోరుట్ల, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాలకు చెందిన ఎంపికైన 8 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.50 వేల విలువైన చెక్కులను శుక్రవారం రోజు తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల, ఇబ్రహీంపట్నం మండలాల ఎంపీడీవోలు, కోరుట్ల, ఇబ్రహీంపట్నం మండల మార్కెట్ కమిటీ చైర్మన్ లు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## తల్లి పాలే బిడ్డకి శ్రీరామ రక్ష



**ముద్ర చిగురుమామిడి :** శిశువుకి సంపూర్ణ ఆరోగ్యం రోగనిరోధక శక్తి కన్న తల్లి పాలతోనే మొదలవుతుంది అని చిగురుమామిడి మండల నవాబుపేట్ గ్రామంలోని అంగన్వాడీ సెంటర్ లో ఏర్పాటు చేసిన తల్లి పాల వారోత్సవాల కార్యక్రమం సందర్భంగా సర్పంచ్ గుళ్ళ రజితా రాజు అన్నారు. అందుకే ప్రతి పసిబిడ్డకు ముర్రుపాలు తల్లి అందించాలని, వాటి వలన పిల్లలలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది అన్నారు. బాల్యం లో రాబోయే రోగాలను ఎదుర్కోడానికి కావలసిన రోగనిరోధక శక్తిని తల్లి పాలే బిడ్డకు అందిస్తాయని, వాటి వలన పిల్లలు సంపూర్ణ ఆరోగ్యం తో ఎదుగుతారన్నారు. అంగన్వాడీ సెంటర్ లలో మంచి పోషకాహారాలు ప్రభుత్వం అందిస్తుంది అని పిల్లలు వయసుకు తగ్గ బరువు కూడా ఉండేలా తల్లిదండ్రులు అంగన్వాడీ టీచర్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు, మూడు ఏండ్లు ఉన్న ప్రతి బిడ్డ ను అంగన్వాడీ సెంటర్ లో చేర్పించాలని కోరారు ఈ కార్యక్రమం లో గ్రామ కార్యదర్శి సంపత్,గ్రామ ఏ ఎన్ ఎం ఆశా కార్యకర్తలు , అంగన్వాడీ టీచర్ లు ఆయాలు పాల్గొన్నారు

## క్షేత్రాలు, తీర్థాల వైభవం తెలిపేవి పురాణాలు

**-బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వర శర్మ..**
**-ముగిసిన శ్రీ బ్రహ్మ మహాపురాణ సప్తాహం...**

**ముద్ర, కోరుట్ల;** అఖండ భారత దేశంలోని పుణ్యక్షేత్రాలు, తీర్థాల వైభవాన్ని తెలిపేవి మన 'అష్టాదశ మహా పురాణాల'ని శృంగేరి శారదాపీఠ ఆస్థాన పౌరాణికులు, పురాణ ప్రవర బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వరశర్మ పేర్కొన్నారు. సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో చేపట్టిన అష్టాదశ మహాపురాణ ప్రవచన జ్ఞాన యజ్ఞంలో భాగంగా శ్రీ బ్రహ్మ మహాపురాణ ప్రవచన సప్తాహం కోరుట్ల వాసవి కళ్యాణ భవనంలో శుక్రవారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా మహేశ్వరశర్మ ప్రవచనం చేశారు. ప్రవచనంలో పాల్గొన్న భక్తులందరికీ యజ్ఞ ప్రసాదం గురువు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సనాతన ధర్మ ప్రచార సమితి ప్రధాన కార్యదర్శి బట్టు హరికృష్ణ, కోశాధికారి రేగుంట రాజారామ్, పురాణ కమిటీ చైర్మన్, పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు పడిగెల శ్రీనివాస్, నిర్వాహకులు నీలి కాశీనాథం, చౌడారపు శ్రీనివాస్. అల్లాడి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 08.08.2026
www.mudranews.in | @mudranews



**చిన్న చిన్న విషయాలు మర్చిపోతున్నారా?**



సమతుల ఆహారం తీసుకోండివిట మిన్లతో పాటు ఐరన్, ఒమెగా-3 వంటి పోషకాలు కూడా మెదడు ఆరోగ్యానికి అవసరం. పోషకాహారాన్ని నిర్లక్ష్యం చేయొద్దు.

# వానలోనూ ఆగని "పొంగులేటి " పర్యటన

## ప్రజా సమస్యలే ప్రాధాన్యం



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** ఆకాశం వర్షిస్తోంది... వాన తుంపరలు కాలనీ బాటలను తడుపుతున్నాయి... అయినా ఆ ప్రజా సంకల్పం ఆగలేదు! వర్షం పడుతున్నా ఏమాత్రం వెనకడుగు వేయకుండా, ఒక చేతిలో గొడుగు పట్టుకుని ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగారు తెలంగాణ రెవెన్యూశాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని సాయిగణేష్ నగర్, ఇందిరమ్మ కాలనీల్లో జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర్‌తో కలిసి మంత్రి క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సాయిగణేష్ నగర్ వీధిలోని ఒక చిన్న టీ కొట్టు వద్ద స్థానికులతో కలిసి వేడివేడి టీ తాగారు. ప్రతి ఇంటా ఉన్న సమస్యలను ఆప్యాయంగా పలకరించారు. తాగునీటి తిప్పలు, కరెంట్ తీగల భయాలు, వర్షపు నీటి ఇబ్బందులను ప్రజలు మంత్రి ముందు ఉంచారు.ఏదులాపురం మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా రూ.100 కోట్ల నిధులు మంజూరు చేశారని ఈ సందర్భంగా మంత్రి ప్రకటించారు. గ్రామ పంచాయతీల కలయికగా ఏర్పడిన ఈ ప్రాంతాన్ని రాష్ట్రంలోనే నంబర్ వన్ మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. వర్షపు నీరు నిలిచే లోతట్టు ప్రాంతాల్లో శాశ్వత డ్రైనేజీ నిర్మాణాలు, తుమ్మ చెట్ల తొలగింపు, తాగునీటి సరఫరాను మెరుగుపరచడం వంటి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడతామని హామీ ఇచ్చారు.ఇందిరమ్మ ఇళ్లు, స్థలాల కోసం ప్రజలు సమర్పించిన వినతులను ప్రభుత్వం అత్యంత సానుకూలంగా పరిశీలిస్తుందని మంత్రి పునరుద్ఘాటించారు. మున్సిపాలిటీలో కొనసాగుతున్న పార్కుల అభివృద్ధి పనులను ఈ నెలాఖరుకల్లా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని, అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉంటూ పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశించారు.ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, ఏదులాపురం మునిసిపల్ చైర్‌పర్సన్ అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మునిసిపల్ కమీషనర్ శ్రీనివాస్, ఆర్అండ్‌బీ ఎస్ఈ యుగంధర్, పంచాయతీ రాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస చారి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, ఆర్డీఓ శ్రీనివాస్ అధికారులు పాల్గొన్నారు.

### 15 నుంచి కొత్త పెన్షన్ల ప్రక్రియ

సంక్షేమం, అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి అందేలా తమ ప్రభుత్వం కృషి చేస్తుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. తిరుమలాయపాలెం మండలం రాజారం, తిప్పారెడ్డిగూడెం, హైదర్‌సాయిపేట, పాతర్లపాడు గ్రామాల్లో రూ. 7 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆగస్టు 15 నుంచి ప్రభుత్వం కొత్త ఆసరా పింఛన్ల మంజూరు ప్రక్రియను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులందరికీ పథకం ఫలాలు పారదర్శకంగా అందేలా తగిన చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.

# దేశానికి రైతులు ఎంత ముఖ్యమో చేనేత నేతన్నలు అంతే ముఖ్యం

## భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి** :జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశానికి రైతులు ఎంత ముఖ్యమో చేనేత నేతన్నలు కూడా అంతే ముఖ్యమని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వరకు సుమారు 400 మంది చేనేత కార్మికులు పాల్గొని జాతీయ చేనేత దినోత్సవ ప్రాముఖ్యతను వివరిస్తూ హ్యాండ్లూమ్ వాక్ చేశారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమాన్ని భువనగిరి శాసనసభ్యులు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి రవికుమార్, గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తి,పద్మశ్రీ అవార్డు గ్రహీత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నలకు చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. నేతన్న అంటేనే ఒక గొప్ప వృత్తి అని అన్నారు. అనాధిక మానవులకి బట్ట ఇచ్చిందంటే చేనేత కార్మికులదే ముఖ్య పాత్ర అని హితవుపలికారు. ఈ రోజుల్లో మిషన్ల ద్వారా తయారీ కంటే అప్పటి కాలంలో మానవులు గౌరవంగా ఉండటానికి నేతన్న నేసిన బట్ట ఇచ్చిన ఘనత నేతన్నలదే అని అన్నారుముఖ్యంగా చేనేత రంగాన్ని జిల్లాలో మరింత అభివృద్ధి చేయడానికి ఎన్నో కార్యక్రమాలు( ట్రెడ్ పోచంపల్లి ఎక్జిబిషన్ లు జరుగుతున్నాయని తెలిపారు.ఎక్జిబిషన్ కోసం కృషి చేసిన, వినూత్న కార్యక్రమాలు చేపట్టినందుకు జిల్లా కలెక్టర్ ను ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ ముందుగా జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నలకు శుభాకాంక్షలు తెలియజేశారు. చేనేత రంగం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని, జాతీయ స్థాయిలోనే పోచంపల్లి ఇక్కత్ చీరలకు ఒక బ్రాండ్ ఉందని అన్నారు.నేతన్నల బ్రాండ్ గుర్తు పట్టేందుకు ఒక QR కోడ్ ను అమలు చేయనున్నట్లు తెలిపారు. ఇతర దేశాల్లో డూప్లికేట్ చేనేత ఇక్కత్ చీరలను మార్కెట్ లో అమ్ముతున్న నేపథ్యంలో పోచంపల్లి బ్రాండ్ అని తెలియజేయుటకు ఒక QR కోడ్ ను తీసుకురావడం జరిగిందని ,ఈ QR కోడ్ ద్వారా నేతన్న ఎన్ని రోజులు చీర తయారు చేశారో, అవి ఏ ధారాలతో తయారు చేశారో, చీర యొక్క ప్రఖ్యాత , మార్కెట్ ధర వివరాలు తదితర అంశాలను ఈ QR కోడ్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. చేనేత కార్మికుల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో చేనేత మరియు జౌళి శాఖ అధికారి శ్రీనివాస్ , యునైటెడ్ వే హైదరాబాద్ రేఖ శ్రీనివాసన్ , అనంతిక సింగ్ , జడ్పీ సీఈవో శోభారాణి , మున్సిపల్ వైస్ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్, సహకార సంఘాల అధ్యక్షులు ,కార్యవర్గం , చేనేత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు

# 10న జైల్ భరో ను జయప్రదం చేయండి



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం :** మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా ఈనెల 10న జరిగే జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఐక్య రైతు, కార్మిక సంఘాల నేతలు పిలుపు నిచ్చారు. అఖిలపక్ష రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల సంయుక్త సమావేశం సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్ లో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న నేతలు మాట్లాడుతూ ఇప్పటికే సంక్షోభంలో ఉన్న వ్యవసాయ –రంగాన్ని మరింత సంక్షోభం దిశగా నడిపేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కుట్ర చేస్తుందన్నారు. సాగు చట్టాలను ఉపసంహరించుకోవడంతో పాటు మోడీ, ట్రంప్ కుదుర్చుకున్న ఒప్పందాన్ని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంతో పాటు గ్రామీణ పేదలు ఆధార పడిన ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి విబిజి రాంజీ పథకాన్ని అమలులోకి తీసుకు వచ్చిందని దీని ద్వారా క్రమేపి జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు ఈ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని వారు ఆరోపించారు. సిపిఐ, ప్రజా సంఘాల పక్షాన కొండపర్తి గోవిందరావు, దొండపాటి రమేష్, తాటి వెంకటేశ్వర్లు, తోట రామాంజనేయులు, కాంగ్రెస్ పక్షాన తుమ్మల యుగంధర్, యరగర్ల హన్మంతరావు, నరాల నరేష్, ఖాదర్ బాబా, సిపిఎం ప్రజా సంఘాల పక్షాన పొన్నం వెంకటేశ్వరరావు, కళ్యాణం వెంకటేశ్వరరావు, మాదినేని రమేష్, బొంతు రాంబాబు, యర్రా శ్రీను, వై. విక్రం, బిఆర్ఎస్ నాయకులు ఎండివై పాషా, మాస్ లైన్ ప్రజా సంఘాల నాయకులు రామయ్య, బందెల వెంకయ్య, ఇమ్మడి హన్మంతరావు, న్యూడెమోక్రసీ పక్షాన ప్రకాష్, ఐ. వెంకన్న పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

## ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్డే

**ముద్ర, దేవరకొండ:** కొండమల్లేపల్లి మండలంలోని గౌరీకుంట తండా, గుడి తండా గ్రామాలలో నూతనంగా నిర్మించిన 20 లక్షలతో మహిళా సమాఖ్య భవనాలను స్థానిక అధికారులతో కలిసి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని నూతన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబన సామాజిక అభివృద్ధికి మహిళా సంఘాలు కీలక శక్తిగా నిలుస్తున్నాయని అన్నారు. మహిళా సమాఖ్యలకు శాశ్వత కార్యాలయం ఉండటం వల్ల సంఘ సమావేశాలు పొదుపు రుణాల నిర్వహణ, లెక్కల నిర్వహణ, శిక్షణా కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సులు, స్వయం ఉపాధి కార్యక్రమాల ప్రణాళికలు ఒకే చోట నిర్వహించుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే అన్నారు. మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ముఖ్యంగా మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం, స్వయం సహాయక సంఘాల బలోపేతానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం, మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించడం, వడ్డీ భారం తగ్గించే చర్యలు, బ్యాంకు అనుసంధాన రుణాల కల్పన, ఉపాధి శిక్షణ కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ స్వర్ణలత, తహసిల్దార్ నరేందర్, ఎంపీఓ సుధీర్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్ రెడ్డి, మండల అధ్యక్షుడు కాసర్ల వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఊట్కూరి వేమన్ రెడ్డి, స్థానిక సర్పంచ్ పసునూరి యుగంధర్ రెడ్డి, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు రామావత్ సరస్వతిరవి, గుడి తండా సర్పంచ్ నేనావత్ కృష్ణ, మాజీ ఎంపీపీ మేకల శ్రీనివాస్ యాదవ్, ఉప సర్పంచ్లు వాంకుడావత్ డాకు, రామావత్ చంటి, ప్రజా ప్రతినిధులు, కొండమల్లేపల్లి మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భూతరాజు ప్రేమలత, ఏపీఎం యాదయ్య, వివోఏ రమావత్ స్వామి, మహిళా సంఘాలు, బంజారా సంఘాలు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు

# ఉపాధి కల్పన ప్రభుత్వాల ప్రధాన బాధ్యత

## .తెలంగాణను పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చిన కేసీఆర్, కేటీఆర్

## బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ఉపాధి కల్పన ప్రభుత్వాల ప్రధాన బాధ్యత, తెలంగాణను పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చింది కేసీఆర్, కేటీఆర్ అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం భువనగిరిలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాల పరిస్థితి, ఐటీ రంగం, పెట్టుబడులు, పరిశ్రమలు, రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం కుదేలైందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణను పెట్టుబడులకు అనుకూల రాష్ట్రంగా తీర్చిదిద్దిందన్నారు. పెట్టుబడులకు అవసరమయ్యేలా 24 గంటల నాణ్యమైన విద్యుత్, మిషన్ భగీరథ ద్వారా తాగునీరు, ఫ్లైఓవర్లు, రోడ్లు, మౌలిక సదుపాయాలు, శాంతిభద్రతలతో హైదరాబాద్‌ను పెట్టుబడిదారులకు విశ్వసనీయ నగరంగా మార్చారని చెప్పారు. తెలంగాణ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో దేశంలో అగ్రస్థానానికి చేరిందన్నారు.కేటీఆర్ నాయకత్వంలో ఐటీ రంగంలో విప్లవాత్మక వృద్ధి చెందిందన్నారు.రేవంత్ పాలనలో పెట్టుబడులకు ప్రతికూల వాతావరణంతో పెట్టుబడుల పరంగా వెనక్కి వెళ్లిందని విమర్శించారు.హైడ్రా, మూసీ కూల్చివేతలు, రియల్ ఎస్టేట్‌పై అనిశ్చితి, వ్యాపారులపై ఒత్తిడి వల్ల పెట్టుబడిదారుల్లో భయం ఏర్పడిందన్నారు.రాష్ట్రం దివాళా తీసిందని ప్రభుత్వం స్వయంగా ప్రచారం చేయడం వల్ల తెలంగాణ ప్రతిష్ఠ దెబ్బతిన్నదన్నారు. అయ్యారని బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు.కంపెనీలు ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నాయని చెప్పారు. పది ఏళ్ల అభివృద్ధిని రెండేళ్లలో కుదేలు చేశారన్నారు. తెలంగాణ యువత భవిష్యత్తు కోసం పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం వెంటనే కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ రైతుబంధు అధ్యక్షులు కొల్పుల అమరేందర్, భువనగిరి పార్టీ టౌన్ అధ్యక్షులు ఎవి కిరణ్, టౌన్ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి, భువనగిరి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పెద్దలు కిష్టయ్య, మాజీ ఎంపీపీ రమేష్, మాజీ జెడ్పీటీసీ సందేలా సుధాకర్, మాజీ కౌన్సిలర్ ఇట్టబోయిన గోపాల్, భువనగిరి మండల ప్రధాన కార్యదర్శి నీల ఓం ప్రకాశ్ గౌడ్, మాజీ ఎంపీటీసీ అబ్బగాని వెంకట్ , జిల్లా నాయకులు ర్యాకల శ్రీనివాస్, వలిగొండ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వెంకట్ రెడ్డి, వలిగొండ మాజీ రైతుబంధు చైర్మన్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షురాలు మమతారెడ్డి, భువనగిరి పట్టణ కౌన్సిలర్లు నాకోటి నాగు, చీమల రాజు, చెన్న మహేష్, నాయకులు గుజ్జ పవన్, భగత్, పెంట నితీష్, ముల్లె నాగేంద్ర బాబు, కంకల మహేష్, ఇండ్ల శ్రీను, అజయ్ నాయకులు పాల్గొన్నారు.

# ఏఎస్సై ఉద్యోగన్నతి పొందిన పోలీస్ అధికారులను అభినందించిన సీపీ



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** వివిధ పోలీస్ స్టేషన్ లలో హెడ్ కానిస్టేబుల్ గా నిరంతరంగా సేవలందించి ఏఎస్సై లుగా ఉద్యోగన్నతి పొందిన 28 మంది పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పదోన్నతి చిహ్నాన్ని అలంకరించి, అభినందనలు తెలిపారు. పదోన్నతి పొందిన ఏఎస్సైలు భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల కు బదిలీపై వెళ్ళనున్నారు.

# స్వాతంత్ర దినోత్సవ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి

## జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం మినీ మీటింగ్ హల్ లో అన్ని శాఖల అధికారులతో స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల నిర్వహణ ఏర్పాట్ల పై ఆయా శాఖల వారీగా సమీక్షించారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా వేడుకలు సజావుగా జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వేడుకలు నిర్వహించనున్నందున అందుకనుగుణంగా వేదిక, వి ఐపిలు, అధికారులకు, ఇతరులకు అనుకూలంగా సీటింగ్ ఏర్పాట్లను పక్కాగా ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా శాఖల వారీగా, స్టాల్స్, శకటాల ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రతిబింబించేలా స్టాల్స్, శకటాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రొటోకాల్ ను అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. జాతీయ భావన పెంపొందేలా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తూ, వేడుకలు విజయవంతం అయ్యేలా చూడాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ ,భువనగిరి ఆర్డిఓ కృష్ణా రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చంద్ర ప్రకాష్ రెడ్డి,వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా కుంభం కీర్తిరెడ్డి పుట్టినరోజు వేడుకలు

## ఘనంగా అన్నదానం రోగులకు పండ్లు పంపిణీ





**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కుమార్తె కుంభం ఫౌండేషన్ ఛైర్పర్సన్ కుంభం కీర్తి రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో పాఠశాల విద్యార్థులతో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎల్లంల జంగయ్య యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భువనగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖబాబురావు, చందుపట్ల పిఎసిఎస్ చైర్మన్ సతీష్ పవన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పచ్చిమట్ల శివరాజు గౌడ్, రావి సురేష్ రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి, డిసిసి ఉపాధ్యక్షుడు చుక్క స్వామి, నానం కృష్ణ ఎలిమినేటి కృష్ణారెడ్డి, డాక్టర్ గోపాల్, కాసాని వెంకటేష్, మండల్ జనరల్ సెక్రటరీ ఎడ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు. వీరవెల్లి లో వీరవెల్లి గ్రామ కుంభం టీం కాంగ్రెస్ పార్టీ వార్డు మెంబెర్ సోకం రాజశేఖర్, నాయకులు నల్లా రమేష్, కంచి పద్మ, చిన్నం విజయ, గ్రామ శాఖ అధ్యక్షులు రేగు శ్రీశైలం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో అంగన్వాడీ విద్యార్థిని విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం, పండ్లు బిస్కెట్ లు చాకిలెట్స్ అందజేశారు. ఉచిత వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నీలాద్రి హాస్పటల్, హయత్ నగర్, అభినవ్ కంటి దవాఖాన మేడిపల్లి వారిచే స్థానిక దివ్య ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిభిరంలో మాట్లాడారు. మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్, గ్రంధాలయ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్, కౌన్సిలర్లు, కో ఆప్సన్ సభ్యులు, చల్ల కిషోర్, భుషపాక మనీష్, ప్రమోద్, శివ, కోళ్ల ప్రవీణ్, శివతేజ, రాకేష్, సంతోష్తోట కార్తీక్, రాజు, దినేష్, వంశీ, వడ్లకొండ శివ, మహేందర్, సాదిక్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.అనాధ ఆశ్రమం లో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు పల్లెర్ల యాదగిరి ఆధ్వర్యంలో అనాధలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ తాంగేళ్ళపల్లి శ్రీవాణి, పోత్నాక్ ప్రమోద్ కుమార్, అవైస్ చిస్తీ పాల్గొన్నారు.

**ముద్ర, బీబీనగర్:** కుంభం కీర్తిరెడ్డి పుట్టినరోజు సందర్భంగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శ్రీ శ్రీ శ్రీ మంగళ మైసమ్మ ఆలయం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని బీబీనగర్ పీఏసీఎస్ అధ్యక్షుడు పొట్టోళ్ల శ్యామ్ గౌడ్ ప్రారంభించారు. అనంతరం బీబీనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. సీఏసీఎస్ వైస్ చైర్మన్ వాకిటి చంద్రశేఖర్ రెడ్డి, బీబీనగర్ సర్పంచ్ పంజాల శ్రీనివాస్ గౌడ్, గడ్డం బాలకృష్ణ గౌడ్, పంజాల శ్రీకాంత్ గౌడ్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రెసిడెంట్ బద్దం వాసుదేవ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోలన్ నిఖిల్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు సోమ శివ, ఉప్పలంచి శివ, కాంగ్రెస్ నాయకులు, సీఏసీఎస్ డైరెక్టర్లు, బీబీనగర్ మండలం గ్రామ సర్పంచులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 08.08.2026
www.mudranews.in | @mudranews



**చిన్న చిన్న విషయాలు మర్చిపోతున్నారా?**

విటమిన్ B12 లోపం. చిన్న చిన్న విషయాలు మర్చిపోవడం, ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలకు విటమిన్ B12 లోపం కారణం కావచ్చు. పాలు, గుడ్లు, చేపలు తీసుకోవడం మంచిది.




# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించాలి




### కలెక్టర్ హైమవతి

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** స్వతంత్ర దినోత్సవ వేడుకలను వైభవంగా సృజనాత్మకతతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్లో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి 15 ఆగస్టు స్వాతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై తగు ఆదేశాలు జారీ చేశారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలను సిద్దిపేట పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో నిర్వహించడం జరుగుతుందని ఈ వేడుకలను సాంప్రదాయ బద్ధంగా ఇన్నోవేటివ్ గా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చే అతిధులు, విద్యార్థులు, ప్రజలు, మీడియా వారు అందరూ సౌకర్యవంతంగా కూర్చునేలా సీటింగ్ ఏర్పాటు చేయాలని, త్రాగునీరు సౌకర్యం కల్పించాలని అన్నారు. ప్రోటోకాల్ ప్రకారం ముందస్తుగా ఇన్విటేషన్స్ పంపించాలని, అదేవిధంగా ప్రోటోకాల్ ప్రకారం పోలీస్ పెరేడ్ నిర్వహణ, ముఖ్య అతిథి ప్రసంగం, ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై వివిధ శాఖల ద్వారా శకటాల ప్రదర్శన, స్టాళ్లను ఏర్పాటు చేయాలని, దేశభక్త సాంప్రదాయక పాటలపై విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, సిద్దిపేట మున్సిపాలిటీ మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని, నిరంతరాయ విద్యుత్ సరఫరా చేయాలని, ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు, ప్రజలు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని, అన్ని శాఖల జిల్లా అధికారులు, వారి కార్యాలయం సిబ్బంది ఈ కార్యక్రమంలో తప్పక పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ లక్ష్మీ కిరణ్, అదనపు డిసిపి సుభాష్ చంద్రబోస్, డిఆర్ఓ నాగరాజమ్మ, ఆర్డీవోలు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

### కలెక్టర్ ప్రతిమా సింగ్

**ముద్ర ప్రతినిధి, మెదక్:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. జిల్లా అధికారులతో శుక్రవారం మినీ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో ఘనంగా నిర్వహించేందుకు గ్రౌండ్, డయాస్ ను పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పూల అలంకరణతో సిద్ధం చేయాలని సూచించారు. వేడుకల సందర్భంగా ప్రజా ప్రతినిధులకు, జిల్లా అధికారులకు, ప్రజలకు సీటింగ్ ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలు జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలతో కూడిన స్టాళ్లు, శకటాల ప్రదర్శనలను ఏర్పాటు చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. పకడ్బందీగా పార్కింగ్, బారికేడ్లు, బందోబస్తు, స్వాతంత్ర దినోత్సవ ఏర్పాట్లు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్, ఆర్డీవో రమాదేవి, డీఎస్పీ ప్రసన్నకుమార్, ఉన్నారు.ఈవీఎం గోదాం తనిఖీఈవీఎం గోదాంను కలెక్టర్ గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నెలవారి తనిఖీ నిర్వహించారు. గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, ఫైర్ ఎక్స్టింగ్విషర్లు, ఇతర భద్రతా పరికరాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ హర్ దీప్ సింగ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులున్నారు.

## పెన్షన్ మంజూరు చేయండి డీఆర్ఓకు విజ్ఞప్తి



**ముద్ర ప్రతినిధి, మెదక్:** రెవెన్యు, పంచాయతి రాజ్ శాఖలో ఉద్యోగ విరమణ పొందిన వి.ఎ.ఓ.లకు పెన్షన్ మంజూరు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్ కు వినతిపత్రం అందజేశారు. మెదక్ జిల్లాలో పలు మండల కేంద్రాల్లో 1965 నుండి 1984 వరకు పటేల్, పట్వారీలుగా, 1992 నుండి 2002 వరకు వి.ఏ.ఓ.లుగా, 2002 నుండి 2007 వరకు పంచాయతి కార్యదర్శులుగా, సహాయ కార్యదర్శులుగా విదులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందినాము. కానీ మాకు నేటివరకు ప్రభుత్వం నుండి పెన్షన్ చెల్లించడంలేదని పేర్కొన్నారు. పలు మార్లు ప్రజా ప్రతినిదులకు, ప్రభుత్వ అధికారులుకు వ్రాతపూర్వకముగా విన్న వించుకున్నా ఏలాంటి న్యాయము జరగలేదన్నారు. ప్రభుత్వం మా యొక్క సమస్యపైన స్పందించి మా యొక్క సర్వీస్ రికార్డులు చూసి నివేదిక పంపమని సి.సి.యల్.ఎ గారికి ఆదేశాలు జారిచేసింది. స్పందించి సి.సి.యల్.ఎకు జిల్లాలో రెవెన్యు, పంచాయతి రాజ్ శాఖలో పదవి విరమణ పొందిన వి.ఎ.ఓ.లు, వి.ఆర్.ఓ.లు, పంచాయితీ కార్యదర్శి, సహాయ పంచాయితీ కార్యదర్శిలకు న్యాయము కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో వి.రాములు, కే.గోపాల్ రావ్, పాండురంగనరావు, బి.విట్టల్, మాణిక్యారెడ్డి, అంజి రెడ్డి, నర్సింరెడ్డి, రాంరెడ్డి తదితరులున్నారు.

## వార్డ్ వార్డ్ లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్.

**ఈనెల 10వ తేదీ నుండి 14 తేదీ వరకు పట్టణం లో పలు వార్డుల్లో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ లు**

**మహిళలు సద్వినియోగం చేసుకోవాలి**

**మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** సిద్దిపేట పట్టణం లో వార్డ్ వార్డ్ లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ లు ఏర్పాటు చేయనున్నట్లు మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు తెలిపారు. శుక్రవారం మాట్లాడుతు హైదరాబాద్ సింధూ హాస్పిటల్ వారి సౌజన్యం తో సిద్దిపేట పట్టణం లో ప్రతి వార్డ్ లో మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 10వ తేదీ నుండి 14వ తేదీ వరకు మొబైల్ స్క్రినింగ్ టెస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి వార్డ్ లో స్క్రినింగ్ టెస్ట్ వాహనం వచ్చి వార్ లో ఒక సెంటర్ లో ఉంటుందని, వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకొని స్క్రినింగ్ టెస్ట్ చేస్తారని చెప్పారు... ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు...ఈ నెల 10 వ తేదీ నుండి 14 తేదీ వరకు స్క్రీనింగ్ టెస్ట్ ల వార్డ్ ల వారీగా షెడ్యూల్....ఈ నెల 10 వ తేదీ న సిద్దిపేట లో 9 గంటల నుండి పోప భవనం సుభాష్ నగర్ లో, 11వ తేదీ న సిద్దిపేట లో 9 గంటల నుండి మహిళా భవన్ నాసార్ పుర్ లో,12 వ తేదీ న 9 గంటల నుండి లక్ష్మీనర్సింహ మినీ ఫంక్షన్ హాల్ లింగారెడ్డిపల్లి లో 13 న 9 గంటల నుండి మెదరి సంఘం హనుమాన్ నగర్ లో 14 న సిద్దిపేట లో 9 గంటల నుండి పట్కర్ సంఘం అంబేద్కర్ నగర్ లో జరుగుతాయన్నారు.. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# గద్దర్ జీవితం నేటి యువతకు స్ఫూర్తి కావాలి

**తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్పర్సన్ డా.వెన్నెల**

**ముద్ర ప్రతినిధి, మెదక్:** గద్దర్ చరిత్ర నేటి యువతరానికి ఒక స్ఫూర్తి కావాలని తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్ పర్సన్ డా. గుమ్మడి వెన్నెల అన్నారు. శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రంలో గద్దర్ మూడవ వర్ధంతి పురస్కరించుకొని ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసే స్థలంలో చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రపంచ వ్యాప్తంగా గద్దర్ పాట ద్వారా ప్రజలను చైతన్య పరిచిన ప్రజా యుద్ధనౌక గద్దర్ అన్నారు. ఆయన జీవితాంతం పీడిత ప్రజల కోసం పోరాటం చేసిన వ్యక్తి అని పేర్కొన్నారు. జీవితాంతం అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ప్రజల్లో చైతన్యం నింపి ఉద్యమానికి ఊపిరి పోసిన గొప్ప ప్రజాకవి అని కొనియాడారు. గద్దర్ జన్మించిన మెదక్ జిల్లాకు ఆయన పేరును ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని ప్రజా సంఘాల తరఫున డిమాండ్ చేశారు. ఆయన చూపిన సామాజిక న్యాయం మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. మాలల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్ష కార్యదరిలు బొమ్మల మైసయ్య ఆకుల పెంటయ్య. సీనియర్ జర్నలిస్టు బొందుగుల నాగరాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గంగాధర్, మున్సిపల్ కౌన్సిలర్లు గంట సంపత్, జుబేర్ కాంగ్రెస్ నాయకుడు మహేందర్ రెడ్డి, మెదక్ జిల్లా టియుడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు శంకర్ దయాళ్ చారి, రిటైర్డ్ ఉపాధ్యాయులు రాధా కిషన్, మనోహర్,,ఇసాక్,, రవిశంకర్, బీఎస్పీ రాష్ట్ర నాయకులు అప్పాజీపల్లి సురేష్ ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు అస్తరు గల్ల బాల్ రాజు, గజ్జల ప్రేమ్ కుమార్, దాసు,, మెదక్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నరసింహ చారి, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్, దళిత ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ పూర్ణగిరిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం అభినందనీయం

**డీఎస్పీ బి .రవీందర్**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం నమాత్పల్లి గ్రామంలోని స్వయంభూ శ్రీ పూర్ణగిరి సుదర్శన లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎస్పీ బి . రవీందర్ హాజరై ముందుగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 8 సీసీ కెమెరాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా డీఎస్పీ రవీందర్ మాట్లాడుతూ.. ఆలయంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలు, ఆలయాలు, ఇతర ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని ఆయన అన్నారు. ఆలయంలో చోరీలు జరిగినా, ఇతర అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకున్నా.. సీసీ కెమెరాల ద్వారా నిందితులను త్వరగా గుర్తించి, వారి పై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. రెండోసారి ఆలయ చైర్మన్గా ఎన్నికైన రావి సురేందర్ రెడ్డి, నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యుల సహకారంతో ఆలయ పరిసరాల్లో ఆధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి పోలీసు అధికారులను ఆహ్వానించినందుకు ఆలయ చైర్మన్ను డీఎస్పీ అభినందించారు. ఆలయ చేర్మెన్ ఆలయానికి వచ్చే భక్తుల భద్రతతో పాటు ఆలయ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో భువనగిరి రూరల్ సిఐ చంద్రబాబు,రూరల్ ఎస్సై లు అనిల్ కుమార్, కె. శివ శంకర్ రెడ్డి, ఆలయ చైర్మన్ రావి సురేందర్ రెడ్డి, ధర్మకర్తలు సురపంగ శ్యామల వెంకటేష్, జిట్టా రాజిరెడ్డి, యెల్లంల నరసింహ యాదవ్, మట్ట బాలకృష్ణ గౌడ్, ఆలయ ప్రధానార్చకులు ఎక్స్ అఫిషియో మెంబర్ జ్యోషి పవన్ కుమార్ శర్మ, ఆలయ సేవకులు కొత్తపల్లి నాగయ్య భక్తులు పాల్గొన్నారు.

### ఆ తేదీల్లో పార్లమెంటు సమావేశాలకు

# తప్పక హాజరుకావాలి

**ఎంపీలకు విప్ జారీ చేసిన కాంగ్రెస్**

**ఈనెల 10, 11, 12 తేదీల్లో పార్లమెంటు సమావేశాలకు తప్పక హాజరుకావాలని విప్ జారీ**

**లోక్సభ, రాజ్యసభలోని కాంగ్రెస్ సభ్యులకు విప్ జారీ**

**ముద్ర, న్యూఢిల్లీ:** వచ్చే వారం పార్లమెంట్లో కీలకమైన అంశాలు చర్చకు రానున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తమ ఎంపీలకు విప్ జారీ చేసింది. ఈ నెల 10, 11, 12న సభ్యులందరూ తప్పనిసరిగా సభకు హాజరు కావాలని ఆదేశించింది. ఈ మేరకు రాజ్యసభ కాంగ్రెస్ చీఫ్ విప్ జైరామ్ రమేష్ తమ సభ్యులకు మూడు లైన్ల విప్ జారీ చేశారు. ఉదయం 11 గంటల నుంచి సభ ముగిసే వరకు ఉండి పార్టీ వైఖరికి మద్దతు ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. లోక్సభలో కాంగ్రెస్ సభ్యులకు కూడా ఇదే విధమైన విప్ను జారీ చేశారు. వచ్చే వారం పార్లమెంట్లో విదేశీ విరాళాల చట్ట సవరణ బిల్లు చర్చకు వచ్చే అవకాశం ఉండటంతో కాంగ్రెస్ ఈ నిర్ణయం తీసుకుంది. నియోజకవర్గాల పునర్విభజనకి సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును కూడా ప్రభుత్వం సభ ముందుకు తీసుకొచ్చే అవకాశం ఉందని తెలిసింది. అయితే, పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి వెల్లడించిన తాత్కాలిక ప్రభుత్వ కార్యక్రమాల జాబితాలో FCRA సవరణ బిల్లు, డీలిమిటేషన్కు సంబంధించిన మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రస్తావన లేదు.

### సాన్ ఫ్రాన్సిస్కోలో

## డిప్యూటీ సీఎం భట్టికి ఘన స్వాగతం




**ముద్ర, సాన్ఫ్రాన్సిస్కో:** అమెరికా పర్యటనలో భాగంగా సాన్ ఫ్రాన్సిస్కో చేరుకున్న తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు విమానాశ్రయంలో అపూర్వ స్వాగతం లభించింది. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖకు చెందిన సాన్ ఫ్రాన్సిస్కో భారత కాన్సులేట్ జనరల్ నహజ్ అలీ ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. అదేవిధంగా ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ నాయకులు, ప్రవాస తెలంగాణవాసులు, అభిమానులు పెద్ద ఎత్తున విమానాశ్రయానికి తరలివచ్చి తమ అభిమాన నాయకుడికి బ్రహ్మరథం పట్టారు.కాగా, భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ, స్థానిక ప్రవాస భారతీయ (ఎన్ఆర్ఐ) సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం (7వ తేదీ) సాయంత్రం 6 గంటలకు సాన్ ఫ్రాన్సిస్కోలోని కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో ప్రత్యేక 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా కాన్సులేట్ ఉన్నతాధికారులు, స్థానిక ప్రవాస భారతీయులు ఆయనను మర్యాదపూర్వకంగా కలవనున్నారు.

## 'మూసీ తరంగాలు–సింహవాహిని శతకం' ఆవిష్కరణ

**ముద్ర, హైదరాబాద్:** మూసీ నది ప్రాశస్త్యం, హైదరాబాద్ బోనాల ఉత్సవాల వైభవాన్ని సమన్వయం చేస్తూ సీనియర్ జర్నలిస్ట్, కవి వరకాల యాదగిరి రచించిన 'మూసీ తరంగాలు–సింహవాహిని శతకం' పద్య సంకలనాన్ని సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుందరెడ్డి, మూసీ పునర్జీవన సంస్థ ఎండీ ఈ. వెంకట నరసింహారెడ్డి ఆవిష్కరించారు. మాసబ్ట్యాంక్లోని మూసీ పునర్జీవన సంస్థ కార్యాలయంలో జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్రెడ్డి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా వెంకట నరసింహారెడ్డి మాట్లాడుతూ గోల్కొండ జగదాంబిక ఆలయం నుంచి ప్రారంభమయ్యే బోనాలు, బల్కంపేట రేణుక ఎల్లమ్మ, సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి, లాల్దర్వాజా సింహవాహిని మహంకాళి బోనాల వైభవాన్ని పుస్తకంలో చక్కగా వర్ణించారని ప్రశంసించారు. ముకుందరెడ్డి మాట్లాడుతూ సీనియర్ జర్నలిస్ట్ యాదగిరి నుంచి వార్తలు, వ్యాసాలతో పాటు పద్య సాహిత్యం వెలువడటం అభినందనీయమన్నారు. హైదరాబాద్ చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని పుస్తకంలో ఆవిష్కరించారని తెలిపారు.జోనల్ కమిషనర్ శ్రీనివాస్రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ వారసత్వ సంస్కృతిపై పుస్తకంలోని అంశాలు నేటి తరానికి విజ్ఞానదాయకంగా ఉంటాయన్నారు. నాలుగున్నర దశాబ్దాలుగా మూసీ నదిని పరిశీలించిన అనుభవంతో ఈ పుస్తకాన్ని రచించినట్లు యాదగిరి తెలిపారు. కార్యక్రమంలో మూసీ పునర్జీవన సంస్థ డైరెక్టర్లు విష్ణువర్ధన్రావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## నేతన్నలకు జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు

**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**



**ముద్ర, అమరావతి:** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నలకు శుభాకాంక్షలు. భారతీయ సంస్కృతిని చాటే చేనేత కళను ముందుకు తీసుకువెళుతున్న చేనేత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. అందులో భాగంగానే 'నేతన్న సేవలో' పథకం ప్రారంభిస్తున్నాం. విద్యుత్ రాయితీలు, 50 ఏళ్లకే పింఛన్ అందిస్తూ నేతన్నలకు దన్నుగా ఉన్నాం. నేడు 71,536 చేనేత కుటుంబాలకు 'నేతన్న సేవలో' పథకం ద్వారా సాయం చేస్తున్నాం. ఒక్కో చేనేత కుటుంబానికి రూ.25 వేల చొప్పున రూ.179 కోట్లు నేతన్నలకు అందిస్తున్నాం. చేనేతల సంక్షేమాన్ని, వృత్తి వారసత్వాన్ని పరిరక్షించే లక్ష్యంతో ప్రభుత్వం ఈ సాయం అందిస్తోంది. అంతా చేతులు కలుపుదాం....చేనేత కళను కాపాడుదాం.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg. No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555